మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 105 వెల - రూ 5:00

తెలంగాణ జాతీయ దినపత్రిక

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag
Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad

మంగళవారం 16 జులై 2024





# బీసీ రిజర్వేషన్‌పై దృష్టి పెట్టండి

## కార్యాచరణ ప్రణాళిక రూపొందించండి

- స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచన
- అసెంబ్లీ సమావేశాల్లోగా మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయం
- పంచాయతీ ఎన్నికలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

హైదరాబాద్, (ప్రజా మంటలు): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పంచాయతీల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. గత పంచాయతీ ఎన్నికల అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపినందున, దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందని, అందుకు ఎంత సమయం తీసుకుంటారని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. కర్ణాటకలో 2015 లో, బిహార్‌లో 2023లో కుల గణన చేశారని, ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేసిన వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కుల గణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందని, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి

మిగతా 2లో..

# కాంగ్రెస్‌లోకి ఆగని బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రవాహం

## - గూడెం మహిపాల్, గాడి అనిల్‌కుమార్‌ల చేరిక

హైదరాబాద్, (ప్రజా మంటలు): అధికార కాంగ్రెస్ పార్టీ ఎత్తులకు బీఆర్ఎస్ పార్టీ చిత్తవుతుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ఆప రేషన్ ఆకర్ష్ కొనసాగుతూనే ఉంది. పలువురు నేతలు ఒక్కరొక్కరుగా కారు దిగి, హస్తం గూటికి చేరుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన హస్తం పార్టీ, ఆ తరువాత బీఆర్ఎస్‌ను ఖాళీ చేసే పనిలో పడింది. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధి నుంచి మరిన్ని చేరికలను ఆహ్వానిస్తోంది. అందులో భాగంగానే ఇవాళ పటాన్?చెరు బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో వీరు తమ అనుచరులతో హస్తం కండువా కప్పుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో మహిపాల్ రెడ్డి, గాలి అనిల్ కుమార్‌లు హస్తం గూటికి చేరారు. చేరికల సందర్భంగా మంత్రులు పొంగులేటి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, నీలం మధు, శశికళా యాదవ్ తదితరులు హాజరయ్యారు.

# ఎగువసభలో తగ్గిన బీజేపీ బలం



4లో..

భాండాగారానికి పాముల కాపలా ప్రచారం అబద్ధం

8లో..

## పాలిట్రిక్స్

పుతిన్ తో చర్చలు
పుణ్యకార్యమేనంట ,
యుద్ధంపై నోరువిప్పని
నమోజీ శభాష్ అంట !
ఉక్రెయిన్ ఉడికింది
నియంతతో సహవాసం ,
అతిపెద్ద ప్రజాస్వామ్యానికి
అవుతుందని చెడువాసం !

-న్యాలకంటి నారాయణ
9346200066



# రూ.2లక్షల పంట రుణమాఫీకి... మార్గదర్శకాలొచ్చాయ్

● రేషన్ కార్డు ప్రామాణికం ● కుటుంబానికి రూ.2 లక్షలు రుణమాఫీ

- స్పష్టం చేసిన వ్యవసాయశాఖ
- మార్గదర్శకాలు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం

హైదరాబాద్, (ప్రజా మంటలు): పంటల రుణమాఫీకి తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. కుటుంబానికి రూ.2లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయశాఖ స్పష్టం చేసింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాల బకాయిలకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుందని, రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్‌కార్డు ప్రామాణికమని తెలిపింది. పంట రుణ మాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయ నున్నారు. రుణమాఫీ నగదు నేరుగా లబ్దిదారుల రుణ ఖాతాల్లోనే జమకానుంది. ఆరోహణ క్రమంలో రుణ మాఫీ సొమ్ము విడుదల చేస్తారు. ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఆర్‌ఎంజీ, ఎల్‌ఈసీఎస్ రుణాలకు, రీషెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు. రుణమాం పై రైతుల సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రైతు సమస్యలు ఉంటే 30 రోజుల్లో పరిష్కారించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్ చూడొచ్చు. లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించవచ్చని తెలిపింది. అన్ని వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార బ్యాంకుల నుంచి రైతులు ఈ కాలంలో రుణాలు తీసుకుంటే వారికి కూడా రుణమాఫీ వర్తించ నుంది. వ్యవసాయశాఖ కమిషనర్, సంచాలకులు (డీఓఏ) పంట రుణమాఫీ 2024 ప థకాన్ని అమలు చేస్తారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పథకానికి భాగస్వామిగా ఉంటుంది. వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసి కలిసి ఐటి పోర్టల్ నిర్వహిస్తారు. ఆ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఐటి పోర్టల్ ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌కి బిల్లులు సమర్పించడం, పథకానికి సంబంధించిన భాగస్వాములతో సమాచారం పంచు కోవడం, రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయి. పథకం అమలు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికారిగా (బీఎస్) నియ మిస్తారు. బ్యాంకు నోడల్ అధికారి బ్యాంకులకు వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ ఐసీ మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. బ్యాంక్ నోడల్ అధికారులు తమ సం బంధితబ్యాంక్‌యొక్కపంట రుణాల డేటాను డిజిటల్ సంతకం చేయాల్సి ఉంటుంది.

# డిగ్రీలెందుకు దండగ.. మోటర్ సైకిల్ పంక్చర్ షాపులు పెట్టుకోండి


## - మధ్యప్రదేశ్ భాజపా ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు



భోపాల్ (ప్రజా మంటలు): చదువుల గురించి మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. విద్యార్థులకు చేసిన సూచన విని అక్కడున్నవారంతా వాక్కయ్యారు. భవిష్యత్తుల్లో విద్యార్థులు మోటర్ సైకిల్ పంక్చర్ దుకాణాలు తెరవాలని సలహా ఇచ్చారు. బాధ్యతాయుత స్థానంలో ఉండి విద్యార్థులకు ఇటువంటి సూచనలు చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ప్రధానమంత్రి కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్'


మిగతా 2లో..

## ప్రజా నాడి




# ఉప్పొంగుతున్న హుస్సేన్‌సాగర్

## ఒక్కరోజు వర్షానికే నిండుకుండలా సాగరం - మరో ఐదు రోజులపాటు భారీ వర్ష హెచ్చరిక



హైదరాబాద్,జూలై15 (ప్రజా మంటలు): ఆదివారం కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ నిండుకుండలా మారింది. జలాశయం లోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. హుస్సేన్‌సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 514 అడుగులు. ప్రస్తుతానికి నీటి మట్టం 513 అడుగులు దాటింది. ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద నీరు మొత్తం హుస్సేన్‌సాగర్‌లో చేరుతోంది. కూకట్‌పల్లి, బంజార, బుల్కాపూర్ నాలాల నుంచి భారీగా వరద వస్తోంది. హుస్సేన్ సాగర్ 2 గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటిమట్టం పెరిగితే ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై జీహెచ్‌ఎంసీ అధికారులు పరిశీలన చేశారు. మళ్లీ రానున్న 24 గంటల్లో వర్షాలు కురిసే నేపథ్యంలో ముంపునకు గురయ్యే కవాడిగూడ, మిగిలిన ప్రాంతాల ప్రజలనూ జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తం చేశారు. నైరుతి రుతుపవనాల కారణంగా ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లో జోరు వానలు కురుస్తున్నాయి. నేటి నుంచి ఐదు రోజుల పాటు తెలుగురాష్ట్రాల్లో

మిగతా 8లో..

రేషన్ కార్డు, పీఎం కిసాన్ డేటా అంటూ

# కొర్రీలెందుకు?

- పథకానికి అనరసర ఆంక్షలు పెట్టడం సరికాదు
- ఇది కొందరినే రుణమాఫీకి పరిమితం చేసే యత్నం
- మార్గదర్శకాల విడుదలకు ఇంత సమయమా?
- రుణమాఫీపై సర్కారువి మభ్యపెట్టే ప్రయత్నాలు
- కాలయాపన చేయడంలో రైతులను మోసం చేసే కుట్ర
- మార్గదర్శకాలపై మండిపడ్డ నిరంజన్ రెడ్డి



8లో..

మొదటి పేజీ తరువాయి

# బీసీ రిజర్వేషన్ పెంపుకు సర్కారు కసరత్తు

కుల గణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతో పాటు స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో రిజర్వేషన్ల పెంపు అంశంపై సుదీర్ఘ చర్చ సాగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర మాజీ మంత్రి కె.జానారెడ్డి, బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాల క్రమ పట్టిక రూపొందించాలని, ఏవైనా సందేహాలు వస్తే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని, చట్టపరమైన విషయాల్లో అడ్వకేట్ జనరల్ తో చర్చించాలని సూచించారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విషయాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. త్వరగా ఆయా అంశాలపై నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మారోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుందామని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, మాజీ మంత్రి జానారెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న,బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డి.ఎస్.లోకేష్ కుమార్, న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### రామసేతు వంతెన కాల్పనికం కాదు

# అది నిజమైన సేతువే ..

### - నిర్ధారించిన ఇస్రో

శ్రీహరికోట (ప్రజా మంటలు):
భారత్, శ్రీలంకల మధ్య రామసేతు వంతెన కాల్పనికం కాదని, నిజమేనని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. ఇస్రో శాస్త్రవేత్తలు అమెరికాకు చెందిన ఐస్‌శాట్ 2 డేటాను వినియోగించి తమిళనాడు లోని ఈ వంతెనకు సంబంధించిన మ్యాప్‌ను విడుదల చేశారు. భారత్, శ్రీలంక మధ్య ఉండే ఈ వంతెన పొడవు 29 కిమీ ఉండగా, ఎత్తు సముద్ర గర్భం నుంచి 8 మీటర్లు ఉన్నట్టు నిర్ధారించారు. ఈ వంతెన తమిళనాడులోని రామేశ్వరం ద్వీపం ఆగ్నేయ దిక్కులోని ధనుష్కోడి నుంచి శ్రీలంక మన్నారు ద్వీపంలోని తలైమన్నార్ వాయువ్య దిశ వరకు విస్తరించి ఉంది. దీనిని సున్నపురాతితో నిర్మించినట్టు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ సేతువు 99.98 శాతం నీటిలో మునిగి ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తున్నారు

- ప్రోటోకాల్ పాటించకుండా అవమానిస్తున్నారు
- సబితా ఇంద్రారెడ్డి ఘటపై స్పీకర్‌కు కెటిఆర్ లేఖ
- తెలంగాణలోనూ ఇక బస్సు ఛార్జీల పెంపు తప్పదు
- కర్నాటక తరహాలో అంటూ విమర్శలు






హైదరాబాద్, (ప్రజా మంటలు):
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారాస ఎమ్మెల్యేల హక్కులను కాలరాసే విధంగా కొత్త సంస్కృతిని తీసుకొచ్చిందని, కావాలనే విపక్ష ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగిస్తోందని భారాస నేత కేటీఆర్ ఆక్షేపించారు. ప్రోటోకాల్ ఉల్లంఘటనలకు సంబంధించి ఆయన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు లేఖ రాశారు. ప్రతి సందర్భంలో ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారిందని పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకొన్న ఎమ్మెల్యేలకు స్థానిక నియోజకవర్గంలో జరిగే ఏ పనికి సంబంధించైనా ప్రోటోకాల్ ఉంటుంది. కాంగ్రెస్ నాయకులుకావాలని భారాస ఎమ్మెల్యేలను అవమానించే లా ప్రోటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్దిదారులకు అందించాల్సిన చెక్కులను స్థానిక ఎమ్మెల్యేలను కాదని, కాంగ్రెస్ నాయకులే పంపిణీ చేస్తున్నారు. హుజూరాబాద్, మహేశ్వరం, అసిఫాబాద్ సహా భారాస ఎమ్మెల్యేలు ఉన్న చాలా నియోజకవర్గాల్లో ఇలాగే జరుగుతోంది. శాసనసభ్యుల హక్కులు, వారికి ప్రోటోకాల్ పరిరక్షణ, గౌరవానికి భంగం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత శాసనసభాపతిదే అని లేఖలో కేటీఆర్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేల హక్కుల రక్షణ విషయంలో సభాపతి అధికారాలను వినియోగించి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. ఈ మేరకు వెంటనే సీఎస్ సహా అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. 'మూడుసార్లు మంత్రి, ఐదు సార్లు ఎమ్మెల్యే అయిన మహిళా ప్రజాప్రతినిధికి ఇందిరమ్మ రాజ్యంలో గౌరవం లేదా? ప్రజలు గెలిపించిన నాయకులకు విలువ లేదా?' అని భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని విస్మరించి.. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి, మూడోస్థానానికి పరిమితమైన కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి అధికార యంత్రాంగం సెల్యూట్ కొట్టడం ఏంటని మండిపడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు ప్రోటోకాల్ పాటించడం లేదని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించిన ఆయన.. ప్రోటోకాల్ విషయంలో ప్రజాప్రతినిధులకు జరుగుతోన్న అవమానం పట్ల స్పీకర్ వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణలోనూ ఇక బస్సు ఛార్జీల పెంపు తప్పదుకర్ణాటకలో ఆర్టీసీ బస్సు ఛార్జీల పెంపు ప్రతిపాదనపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. బస్సు ఛార్జీల పెంపుపై కర్ణాటకను తెలంగాణ అనుసరించే రోజు ఎంతో దూరంలో లేదని పేర్కొన్నారు. ఎక్స్(ట్విటర్) వేదికగా ఆయన పోస్ట్ చేశారు. ఏదైనా ఉచితంగా ఇస్తామంటున్నారంటే మరో ఆలోచనతో తీసుకెళుతున్నట్లేనని తెలిపారు. ఉచితంగా ఇస్తామన్నారంటే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కర్ణాటకలో బస్సు టికెట్ ఛార్జీల్ని పెంచేందుకు కేఎస్ఆర్టీసీ కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ బస్సుల్లో ఛార్జీల పెంపు అనివార్యమని కర్ణాటక రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ ఛైర్మన్ ఎస్ఆర్ శ్రీనివాస్ ఇటీవల తెలిపారు. 15 నుంచి 20శాతం మేర ఛార్జీల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనల్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు ఆయన చెప్పారు. 'ఇంధనం, ఆటో విడిభాగాల ధరలు గణనీయంగా పెరిగాయి. 2019 నుంచి బస్సుల్లో టికెట్ ఛార్జీల్ని పెంచలేదు. 2020 నుంచి కేఎస్ఆర్టీసీ ఉద్యోగుల వేతన సవరణ జరగలేదు. అందువల్ల టికెట్ ధరలను పెంచడం తప్పడం లేదు. గత మూడు నెలల్లో కార్పొరేషన్‌కు రూ.295 కోట్ల నష్టం వాటిల్లింది. 40 కొత్త ఓల్వో బస్సుల్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాం. ఇప్పటివరకు 600 సాధారణ బస్సుల్ని కొనుగోలు చేశాం' అని తెలిపారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# రైతుల అభిప్రాయాలు తెలుసుకుని రైతుభరోసా జీవో విడుదల చేస్తాం

- పథకంపై త్వరలోనే చారిత్రాత్మక నిర్ణయం
- అందరి అభిప్రాయాలు తీసుకోవడానికే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కార్యశాలలు
- నిరుద్యోగులను రెచ్చగొట్టేందుకు ప్రతిపక్షాల కుట్రలు
- మాది ప్రజా ప్రభుత్వం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క




హైదరాబాద్, (ప్రజా మంటలు):
రైతు భరోసాపై ప్రభుత్వం త్వరలోనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని, చట్ట సభల్లో చర్చించి, నిర్ణయం వెలువరిస్తామని చెప్పారు. రైతుల అభిప్రాయాలే ప్రభుత్వ జీవోగా విడుదల చేస్తామని తెలిపారు. కౌలు రైతుల సమస్యలూ తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు.రైతు భరోసా పథకం అమలు, విధి విధానాలకు సంబంధించి అన్నదాతల సలహాలు, సూచనలు తీసుకునేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం హనుమకొండ కలెక్టరేట్?లో జరిగింది. మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, సీతక్క, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులు, రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా పథకం ఎలా ఉంటే అందరికీ ప్రయోజనంగా ఉంటుందన్న దానిపై అన్నదాతల నుంచి సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా తమది ప్రజా ప్రభుత్వం అన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అందరి అభిప్రాయాలు తీసుకోవడానికే రాష్ట్రవ్యాప్తంగా రైతులతో కార్యశాలలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పన్ను రూపంలో ప్రజలు ప్రభుత్వానికి కట్టే ప్రతి రూపాయి, తిరిగి ప్రజలకే చెందాలన్నదే తమ అభిమతమని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాలే జీవోగా వస్తుందని, శాసనసభలో చర్చించి, అందరి అభిప్రాయలను తీసుకుని, చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఆగస్టులోనే రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. గతంలో రైతులు పంట నష్టపోతే సాయం అందలేదని, కానీ తమ ప్రభుత్వం అన్నదాతలకు రూ.10 వేలు ఇచ్చి ఆదుకుందని తెలిపారు. పంట నష్టం జరిగితే ప్రతి ఒక్క రైతుకూ పంట బీమా రావాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలతో బీమా పథకం వర్తింపజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓవైపు అప్పులు తీరుస్తూ, సంక్షేమం, అభివృద్ధి చేపడుతుంటే, ప్రధాన ప్రతిపక్షం రైతులను, నిరుద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. పది జిల్లాల రైతుల ఆలోచనల మేరకే రైతు భరోసా పథకం ఉంటుందని తెలిపారు. ఐటీ రిటర్న్స్ ఉంటే రైతు బీమా రాదన్నది తప్పుడు ప్రచారమేనని స్పష్టం చేశారు. బీఆర్?ఎస్? పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని మంత్రి కొండా సురేఖ విమర్శించారు. రైతుబంధు పథకాన్ని గత పాలకులు దుర్వినియోగం చేసి, రూ.లక్షల ప్రజాధనం వృథా చేశారని ఆరోపించారు. సాగు యోగ్యమైన భూములకే భరోసా అందిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. నాలుగు గోడల మధ్య ఉండి నిర్ణయాలు తీసుకుని, ఇదే అందరి అభిప్రాయమని చెప్పకుండా, క్షేత్రస్థాయిలో అందరి సలహాలు, సూచనలతో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.పథకం విధి విధానాల రూపకల్పనలో తమ అభిప్రాయాలు తీసుకునేందుకు మంత్రులు తమ వద్దకే రావడం సంతోషకర పరిణామమని రైతులు హర్షం వ్యక్తం చేశారు. 10 ఎకరాల్లోపు రైతులకు రైతు భరోసా అందించాలని మెజారిటీ రైతులు సమావేశంలో అభిప్రాయపడ్డారు. దీనితో పాటుగా పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, బోనస్ ఇవ్వాలని, రైతు సమస్యలపై రైతు కమిషన్ వేయాలని, కోతుల బెడద తగ్గించాలని విజ్ఞప్తి చేశారు.

# ఎంత ఎదిగినా ఒదిగి ఉండాల్సిందే

- గత ప్రభుత్వంలో రోడ్డుపైకి రావాలంటేనే భయం
- చంద్రబాబును జైల్లో పెట్టారు...ఇసుకను దోపిడీ చేశారు
- జనసేన విజయం కోసం పాటుపడ్డ వారికి అండగా నిలవాలి
- ప్రజాప్రతినిధులు అవగాహనతో ముందుకు సాగాలి
- జనసేనాని పవన్ కల్యాణ్ హెచ్చరిక



గుంటూరు,జూలై15 (ప్రజామంటలు):
వైకాపా ప్రభుత్వ హయాంలో రోడ్డుపైకి రావా లంటే భయమేసే పరిస్థితి ఉండేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో సామాజిక మాధ్యమంలో పోస్టు పెట్టాలంటే భయం. ఇంట్లో వాళ్లపై కూడా దుర్భాషలాడిన పరిస్థితిని చూశామని అన్నారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ప్రతినిధుల భేటీలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు సభ్యుడిని బంధించి కొట్టించిన తీరు చూశాం. సుదీర్ఘ అనుభవం, సీఎంగా పనిచేసిన చంద్ర బాబును కూడా జైలులో పెట్టారు. అడ్డగోలుగా ఇసుక దోపిడీ, భూ కుంభకోణాలు చేశారు. అందుకే ఐదు కోట్ల మంది ఒక్కటై అరాచక ప్రభుత్వానికి బుద్ధి చెప్పారని అన్నారు. నేను ప్రధాని మోదీ గుండెల్లో ఉన్నా.. ఆయన పక్కన నిల్చొని ఫొటో దిగాల్సిన అవసరం లేదు. అధికారం కోసం కాదు.. ప్రజల కోసం పోరాటం చేశాం. జనసేన తీసుకున్న మంత్రి పదవులు కూడా ప్రజలతో నిత్యం సంబంధం ఉన్నవి. మన పార్టీ ఎంపీలు ప్రజా సమస్యలపై పార్లమెంటులో మాట్లాడాలని అన్నారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఎంత సాధించినా తగ్గి ఉండటం అవసరం. ఎన్టీఆర్ పార్టీ పెట్టినప్పుడు కూడా ఇలాంటి మెజార్టీ రాలేదని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నాతో అన్నారు. వైకాపా వాళ్లు మనకు ప్రత్యర్థులు మాత్రమే, శత్రువులు కాదు. చేతగాక కాదు.. కక్ష సాధింపు చర్యలు ఎవరికీ మంచిది కాదు. వైకాపా చేసిన తప్పులు మనం చేయకూడదని అన్నారు. అలాగని వాళ్లు చేసిన తప్పులు సహించేదిలేదు. చట్టపరంగా చర్యలు ఉంటాయి. జనసేన తరఫున పోటీ చేసిన మొత్తం 21 మందిని గెలిపించారు. పోటీ చేసిన చోటే కాదు.. చేయని చోట్లా వీర మహిళలు, జనసైనికులు తీవ్రంగా పోరాడారు. బాధ్యతలు మోసే ప్రతిఒక్కరికీ నేను అండగా ఉంటానని అన్నారు. జనసైనికులు, వీర మహిళలు నావైపు బలంగా నిలబడ్డారు. ఎలాంటి పదవి ఆశించ కుండా పోరాడారు. ఊహించని మెజారిటీతో గెలవడం గొప్ప విషయం. పంచాయతీల్లో బ్లీచింగ్‌కు కూడా డబ్బులు లేవు. ఏడీబీ ద్వారా నిధులు తెచ్చేందుకు మాట్లాడుతున్నాం. సీఎం చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి అవసరం. నేను ప్రధాని మోదీని ఇప్పటివరకూ ఏం అడగలేదు. ఇప్పుడు రాష్ట్రం కోసం అడుగుతా. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వద్దని చెబుతా. రైల్వే జోన్ ఏర్పాటు గురించి, 25 లక్షల ఉద్యోగాలు కావాలని అడుగుతా అని పవన్ తెలిపారు. పార్టీని అంచెలంచెలుగా పెరిగేలా చేయడంలో పవన్ చాలా ఓపికతో.. వ్యూహంతో వ్యవహరించారని మంత్రి నాదెండ్ల మనోహర్ పార్టీ తరఫున గెలిచిన ప్రజా ప్రతినిధులను అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సత్కరించారు. ముందుగా మంత్రి నాదెండ్లను సత్కరించారు. ప్రజా ప్రతినిధులకు శాలువా కప్పి, గిఫ్ట్ గా కూరగాయలు అందించి పవన్ సన్మానించారు. అనంతరం పవన్ కళ్యాణ్‌ను జనసేన ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ఉన్నామని... మిత్రపక్షాలతో సమన్వయంతో వెళ్లాలన్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బంది.. మచ్చ రాకుండా అందరూ పని చేయాలని మంత్రి సూచించారు. పదవులు మనకొచ్చాయి.. కానీ మన కోసం పని చేసిన జనసైనికులు, వీర మహిళలను మరువద్దు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి. పార్టీ మీద, ప్రభుత్వం మీద దుష్ప్రచారం మొదలు పెడతారు.. తిప్పి కొట్టాలి. కూటమి ప్రభుత్వం అమలు చేసే పథకాలు.. అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవాలి. నిజాయితీగా పని చేయాలి. గత ప్రభుత్వం సంక్షేమం పేరుతో దోపిడీ చేసింది. త్వరలో క్రియాశీల సభ్యత్వాన్ని ప్రారంభించనున్నాం. గతంలో తక్కువ సంఖ్యలోనే క్రియాశీలక సభ్యులను చేర్పించాం. ఇప్పటి వరకు సుమారు కార్యకర్తలకు ఆర్థిక సాయం కింద రూ. 18 కోట్లు అందించామని చెప్పుకొచ్చారు. ప్రభు త్వంలో ప్రతి జనసైనికుడూ భాగస్వామే అని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసే శ్వేత పత్రా లపై అవగాహన పెంచుకోవాలని.. ప్రజలకు వివరించాలన్నారు.ఇది మన ప్రభుత్వమని.. పార్టీకి.. పవన్‌కు మంచి పేరు వచ్చే విధంగా పని చేయాలన్నారు. పవన్ కళ్యాణ్ టీం అంటే ఇదీ అని అందరూ గొప్పగా చెప్పుకునేలా పని చేయాలన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు సైలెంటుగా ఓటేశారని.. ఎన్నికల ముందు వరకు ఏ మాత్రం బయటపడని ప్రజలు.. ఎన్నికల్లో తామేంటో చూపించారని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# రైతు భరోసా పథకం విధి విధానాలపై వర్క్ షాప్

హనుమకొండ జులై 15 (ప్రజామంటలు): హన్మకొండ కలెక్టరేట్ లోని ఐడిఓసి సమావేశ మందిరంలో సోమవారం రైతు భరోసా పథకం విధి విధానాలపై నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యశాల (వర్క్ షాప్) లో ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సభ్యులైన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జ్, రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), ఎం.పీ. లు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, రాష్ట్ర ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే లు నాయిని రాజేందర్ రెడ్డి, కడియం శ్రీహరి, దొంతి మాధవ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, హనుమండ్ల యశస్విని రెడ్డి, భూక్య మురళి నాయక్ గార్లతో కలిసి పాల్గొన్న వర్ధన్నపేట శాసనసభ్యులు విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు. ఈ సమావేశంలో కార్పొరేషన్ల చైర్మన్లు, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు, ఆదనవు కలెక్టర్లు, వ్యవసాయ శాఖ, సంబంధిత శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు భరోసా విధివిధానాలపై రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర వర్గాల నుంచి మంత్రివర్గ ఉపసంఘం అభిప్రాయాలను సేకరిస్తున్నారు.




## జగన్ తీరుతో ఆర్థిక పరిస్థితి అధ్వాన్నం

### మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

విశాఖపట్టణం,జూలై15 (ప్రజామంటలు): జగన్ సర్కార్ అనాలోచిత నిర్ణయాల వల్ల ఏపీ ఆర్థిక పరిస్థితి దారుణంగా మారిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. వైసీపీ హయాం లో కేంద్రం భారీగా ఇచ్చిన నిధులను జగన్ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆయన ఆరోపించారు. విశాఖలో పర్యటించిన కేంద్ర మంత్రి ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. భూపతిరాజు మాట్లాడుతూ.. 'కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం ఖర్చు చేయకపోగా, అసలు ఏ ఖాతాలోకి మళ్లించారో కూడా కేంద్రానికి సమాచారం ఇవ్వలేదు. ఆ వివరాలు అందిస్తే గాని మళ్లీ నిధులు విడుదల చెయ్యలేని స్థితిని వైసీపీ తెచ్చింది. అందుకే కొత్తగా నిధులు ఇచ్చేందుకు ఇబ్బందులు వస్తున్నాయని కేంద్ర ప్రభుత్వ అధికారులు చెప్తున్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో తమ పాత్ర కచ్చితంగా ఉంటుందని సీఎం చంద్రబాబుకి ప్రధాని మోడీ హామీ ఇచ్చారు. ఈ మేరకు రాజధాని అమరావతి అభివృద్ధికి ఆయన కట్టుబడి ఉన్నారు. విశాఖ స్టీల్ ఎ÷–లాంట్ సమస్య మీద ఇప్పటికే సమీక్ష నిర్వహించా. ఇకపై తరచూ విశాఖ వస్తూ ఉంటా. స్థానిక సమస్యల పరిష్కార దిశగా అడుగులు వేస్తా' అని చెప్పారు.



జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన గౌతం రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

## మచ్చుమర్రి బాలిక కుటుంబానికి పదిలక్షల పరిహారం

### దోషులను వదిలేది లేదన్న హోంమంత్రి అనిత

అమరావతి,జూలై15(ప్రజామంటలు):మచ్చుమర్రి అత్యాచార నిందితులను వదిలే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ముచ్చుమర్రి కేసులో బాధిత బాలిక కుటుంబానికి రూ.10లక్షలు పరిహారం అందజేయనున్నట్లు తెలిపారు. మరోచోట అత్యాచారానికి గురైన బాలిక పేరుతో రూ.5లక్షలు ఫిక్స్డ్ డిపాజిట్ చేస్తామని వెల్లడించారు. ఆడపిల్లతో అసభ్యంగా ప్రవర్తించిన వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. అమరావతిలో ఆమె మీడియాతో మాట్లాడారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎల్లాల గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలికపై మైనర్ బాలురు అత్యాచారం చేశారు. 14 నుంచి 16 ఏళ్లలోపు వయసున్న ముగ్గురు.. ఆ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి ఇంట్లో చెబుతుందన్న భయంతో హత్య చేసినట్లు సమాచారం. బాలిక ఆచూకీ కోసం పోలీసులు చేపట్టిన గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల జులై 15 (ప్రజామంటలు):



వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో 14వ వార్డు స్పెషల్ డ్రైవ్ కింద మురికి కాలువలు, నాలా పనులను పరిశలించారు. మున్సిపల్ చైర్పర్సన్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వాతావరణంలో చోటుచేసుకునే మార్పుల ఫలితంగా సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి వ్యాధులతో పాటు విషజ్వరాలు ప్రబలే అవకాశం అధికంగా ఉంటుందని తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఆరోగ్యం కాపాడుకోడానికి కాచి వడపోసిన నీటిని తీసుకోవడం మంచిదని సూచించారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బ్లీచింగ్ పౌడర్‌తో క్లోరినేషన్ చేయాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా పాటిస్తే వ్యాధులను అరికట్టవచ్చని పేర్కొన్నారు. వర్షం నీరు నిల్వ ఉన్నచోట ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. అధికారులు పట్టణ పరిశుభ్రత పాటించాలి. పట్టణ మున్సిపల్ అధికారులు పట్టణం లో అన్ని వార్డుల్లో డ్రైనేజీలు, ఖాళీ స్థలంలో చెత్త చెదారం, శుభ్రపరిచి ప్రజలు ప్లాస్టిక్ కవర్లు నివారించాలని, బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టాలని మున్సిపల్ అధికారులు సంన్వయంతో పని చేసి సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కూతురు పద్మ శేఖర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చిన్నారులపై అఘాయిత్యాలు

### కఠిన చర్యలు ఉంటాయన్న చంద్రబాబు
### ఎర్ర దొంగలను కూడా వదిలేది లేదని హెచ్చరిక

అమరావతి,జూలై15(ప్రజామంటలు):

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా గత కొన్నిరోజులుగా చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలపై సీఎం నారా చంద్రబాబు తొలిసారి స్పందించారు. సోమవారం నాడు సెక్రటేరియట్‌లో గత ప్రభుత్వం గనుల శాఖలో చేసిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా.. శాంతి భద్రతలు, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కూడా మాట్లాడారు. రాష్ట్రంలో చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల విషయంలో ప్రభుత్వం చాలా కఠినంగా ఉంటుందని హెచ్చరించారు. అంతేకాదు.. ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్న వారికి సీబీఎన్ స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇచ్చారు.'ఏపీలో ఎవరైనా ఇంకా మత్తులో ఉంటే వారికి గట్టి హెచ్చరికలు చేస్తున్నాం. ఇంకా నా ఓపిక, సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఇలాంటి వారికి ఎలాంటి షాక్ ట్రీట్మెంట్ ఇవ్వాలో ఇస్తాను.. అది ప్రజలందరూ చూస్తారు. నంద్యాలలో బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన.. విజయనగరంలో ఆర్నెళ్ల పసికందుపై అత్యాచార ఘటన సభ్య సమాజం తలదించుకొనేలా ఉంది. ఈ కేసులు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా త్వరిత గతిన విచారణ చేయాలి. బాధిత కుటుంబాలను ఆదుకునేలా చర్యలు తీసుకుంటాం' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. మొత్తానికి చూస్తే.. ఇకపై ఇలాంటి ఘటనలు పాల్పడే వారికి కఠిన చర్యలు ఉంటాయని 'ఎర్రచందనం స్మగ్లర్లపై కఠిన చర్యలు ఉంటాయి. నేరస్థులు, దోపిడీదారులను కఠినంగా శిక్షిస్తాం. బాండ్లు, రేషన్ బియ్యంలో అక్రమాలు జరిగాయి. దొంగకు తాళాలు ఇచ్చి దోచుకునేలా గత ప్రభుత్వం చేసింది. పర్యావరణాన్ని దెబ్బతీస్తే భావితరాలు దెబ్బతింటాయి. ప్రకృతి సంపద ప్రజలకు చెందాలి. గనుల బాధితులు ముందుకు వచ్చి ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలి. ఎర్రచందనం దొంగ రవాణా కోసం అక్రమాలు జరిగాయి. ఎర్రచందనాన్ని చైనాకు దొంగ రవాణా చేశారు.

## డిగ్రీలెందుకు దండగ.. మోటర్ సైకిల్ పంక్చర్ షాపులు పెట్టుకోండి



పేరుతో మధ్యప్రదేశ్‌లోని 55 జిల్లాల్లో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటును కేంద్ర హోంమంత్రి అమిత్ షా వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ క్రమంలోనే గుణ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే పన్నాలాల్ షాక్య ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "నేడు పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఘనంగా ప్రారంభమైంది. అయితే.. మీరు చదివే డిగ్రీతో భవిష్యత్తులో పెద్దగా ఏమీ ఉపయోగముండదు. అందుకని మీకో సలహా ఇవ్వాలనుకుంటున్నా. డిగ్రీలకు బదులుగా జీవనోపాధి కోసం కనీసం మోటార్ సైకిల్ పంక్చర్ రిపేర్ దుకాణాలను తెరవండి. ఇది మీరు కచ్చితంగా గుర్తుంచుకోండి" అని వ్యాఖ్యానించారు.ఎమ్మెల్యే మాటలకి అక్కడున్న వారంతా ఒక్కసారిగా కంగుతిన్నారు. ఆ స్థాయిలో ఉండి విద్యార్థులకు ఇలాంటి సూచన చేయడమేంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కాగా.. ఒక్క రోజులోనే స్థానికంగా 11 లక్షల మొక్కలు నాటి ఇండోర్ గిన్నిస్ రికార్డు సృష్టించడాన్ని ప్రస్తావించిన ఆయన.. పెరుగుతున్న కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలు నాటుతున్నారు.. కానీ, ఆ తర్వాత వాటి పరిరక్షణ గురించి పట్టించుకోవడం లేదని వాపోయారు. కాగా.. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజు 11లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన అమిత్ షా.. ఇండోర్ సహా అన్ని జిల్లాల్లో అభివృద్ధి చేసిన పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను వర్చువల్‌గా ప్రారంభించారు. బట్టీ చదువుల ద్వారా స్కోరు పెరిగినా విద్యార్థుల్లో నైపుణ్యాలు అభివృద్ధి చెందడం అసాధ్యమన్నారు. నూతన విద్యా విధానం కింద ఏర్పాటు చేసిన పీఎం ఎక్సలెన్స్‌లతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. అయితే.. తాజాగా ఎమ్మెల్యే పన్నాలాల్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

## ఉక్కు పరిశ్రమల ఏర్పాటుకు అడుగేయాలి

### నిరుద్యోగ యువతకు భరోసా కల్పించాలి

కడప,జూలై15 (ప్రజా మంటలు):

దేశంలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం ముఖ్యం. అలాగే ఈ విషయంలో కొంత నష్టం లేదా కష్టం కలిగినా యువతకు ఉపాధి లక్ష్యంగా ముందుకు సాగాలి. అంతేగానీ వీటి ఏర్పాటు సాధ్యం కాదనుకుంటే దేశంలో లక్షలాదిగా ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి దక్కదు. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు సాధ్యం కాదని చెప్పడం వల్ల యువతో ఆందోళన నెలకొని ఉంది. అలాగే స్థానికంగా లభ్యమవుతున్న ముడిసరుకుని విదేశాలకు తరలిస్తున్న తీరును అడ్డుకునేలా లేదు. కడప, బయ్యారం ఉక్కు కర్మాగారాల ఏర్పాటు సాధ్యం కాదంటూ కాలయాపన చేయడం వల్ల ఎందరో యువత ఆశలను దెబ్బతీశారు. అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లో అపారమైన ఇనుప ఖనిజ నిల్వలున్నాయనీ, అనంతపురం గనుల ఖనిజం నాణ్యత ఎక్కువనీ మెకాన్ సంస్థ నిర్ధారించింది. కడప ఉక్కు కర్మాగారానికి ఆ ఖనిజ నిక్షేపాలను కేటాయిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతనూ తెలిపింది. వీటన్నిటి ఆధారంగా కడప ఉక్కు కర్మాగార ఏర్పాటు సాధ్యమేనని మెకాన్ సంస్థ సమర్పించిన ప్రాథమిక నివేదికలో పేర్కొంది. ఇలాంటి విషయాల్లో కాలయాపన చేసి చివరికి చేతులెత్తేయడం ద్వారా బృహత్తర లక్ష్యాన్ని దెబ్బతీయడం కాకా మరోటి కాదు. ఇలా చేయడం ద్వారా నిరుద్యోగ యువతకు ఉన్న అవకాశాలను దెబ్బతీయడం తప్ప మరోటి కాదు. సామాన్య ప్రజలనేగాక న్యాయ వ్యవస్థనూ మోడీ సర్కారు పక్కదారి పట్టించందనే అనుకోవాలి. కడప ఉక్కు విషయంలో మోసాన్ని రాష్ట్ర ప్రజలు ముక్త కంఠంతో నిరసిస్తున్నారు. కడప ఉక్కుపట్ల కేంద్రం ఎంత ప్రతికూలంగా వుందో స్పష్టమవుతోంది. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక నిధులు మూడేళ్లు మాత్రమే ఇచ్చి, తర్వాత నిలిపివేసింది. పోర్టు ఏర్పాటుకూ తిలోదకాలిచ్చింది. ఇలా అనేక అంశాల్లో తెలుగు ప్రజలపట్ల మోడీ సర్కారు ద్వేషపూరితంగా వ్యవహరిస్తోంది. సంకుచిత స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు విరుద్ధంగా అభివృద్ధి సాగాలి. అప్పుడే ఉక్కు పరిశ్రమల ఏర్పాటు సాకారం కాగలదు.

## స్త్రీజనోద్ధరణ పాటుపడిన యోధురాలు

### దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి సందర్భంగా


విజయవాడ,జూలై15(ప్రజా మంటలు):

తన జీవితమంతా సమాజ సేవకు ముఖ్యంగా స్త్రీజనోద్ధరణకు అంకితం చేసిన స్ఫూర్తిప్రదాత శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్. ఈమె దేశభక్తురాలిగా, స్వాతంత్ర్య సమరయోధు రాలిగా, సంఘ సంస్కర్తగా, కార్యకర్తగా, రచయిత్రిగా... తన కాలంలో మరెవరూ చూపని ధైర్యసాహసాలను, ప్రజ్ఞను చూపి చరిత్రలో నిలిచిపోయారు.మన ఆంధ్రరాష్ట్రం గర్వించదగ్గ మహిళామూర్తుల్లో దుర్గాబాయిని అగ్రగణ్యులుగా చెప్పుకోవచ్చు. 1909 వ సంవత్సరం జూలై 15వ తేదీన కాకినాడలో కృష్ణవేణమ్మ, రామారావు దంపతులకు దుర్గాబాయి జన్మించారు. ఈమె బాల్యంనుండీ ప్రతిభాపాటవాలను కనబరుస్తూ పది సంవత్సరాల వయస్సులోనే హిందీలో పాండిత్యాన్ని సంపాదించి, హిందీ పాఠశాలను నెలకొల్పి అన్ని వయసులవారికీ విద్యాబోధన కావించేవారు.అందరూ మనిషులుగానే పుడతారు.. కానీ కొందరు మాత్రమే మహామనుషులుగా నిలుస్తారు. నేటి సమాజంలో వేనూళ్లుకున్న స్వార్థం.. నేను, నావాళ్ళు.. అనే పదాలకు పూర్తి భిన్నంగా మేము మావాళ్లు అనే భావనతో సమాజంలో మార్పుకు.. సంఘహితం కోసం చేసిన కార్యక్రమాలకు తమ సొంత డబ్బులు, అస్తులు కూడా అమ్మి నేటికి ఆ కార్యక్రమాలతో మానవ జాతిలో చిరస్థాయిగా తరతరాలుగా నిలిచిపోయిన వారే మహనీయులు. అలాంటి వారిలో దుర్గాబాయ్ దేశ్ ముఖ్ ఒకరు.ఆమె వ్యక్తి మాత్రమే కాదు, ఒక వ్యవస్థ, ఓ గొప్ప మహోన్నత శక్తి. మేధావిగా, న్యాయకోవిదు రాలుగా, మానవతావాదిగా, ఆంధ్రమహిళాసభ వ్యవస్థాపకురాలిగా.. బహుముఖ ప్రజ్ఞను కనబరిచి చరిత్రపుటల్లో మహామనిషిగా కీర్తి సాధించారు. దుర్గాబాయి తన 11 సంవత్సరాల ప్రాయంలో ఖాదీ ప్రదర్శన జరుగుతున్న సమయంలో ఆమెను వాలంటీర్‌గా నియమించినపుడు ఆ ప్రదర్శనను తిలకించడానికి వచ్చిన పండిట్ నెహ్రూగారిని టికెట్ లేని కారణంగా అనుమతించలేదు... బ్రిటిషు అధికారులచే 'ఆడసింహం'గా అభివర్ణించబడ్డ ధీరవనితగా, తనను తాను సంఘానికి సమర్పించుకున్న పూజనీయ వ్యక్తిగా, చైతన్య సేవా స్రవంతిగా అందరినోటా కీర్తించబడ్డ దుర్గాబాయి... 1981 మే 9వ తేదీన హైదరాబాదులో పరమపదించారు.

## మాకొద్దీ తెల్లదొరమంటూ.. 'ఎలుగెత్తిన మహాకవి

### జాతీయ కవి శ్రీ గరిమెళ్ల సత్యనారాయణ

శ్రీకాకుళం,జూలై15 (ప్రజా మంటలు):



గరిమెళ్ల సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించారు.'మాకొద్దీ తెల్లదొరమంటూ..' గేయం రాసి పాడి నాటి ఉద్యమకారుల్లో స్ఫూర్తి రగిలించిన మహోన్నత వ్యక్తి గరిమెళ్ల సత్యనారాయణ.. జాతీయ గేయకవిగా ప్రసిద్ధి పొంది తన గీతాల తూటాలతో బ్రిటీష్ వారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించడమే కాకుండా వారి ఆగ్రహానికి గురై జైలు జీవితాన్ని అనుభవించిన వ్యక్తి గరిమెళ్ల.. దేశభక్తిపై గరిమెళ్ల రాసిన కవితలు అప్పటి కలెక్టర్ బ్రేకన్ ఆగ్రహానికి గురై జైలుశిక్ష అనుభవించిన వారిలో మొదటి వారు.. జాతీయోద్యమంలో శ్రీకాకుళం జిల్లా కీర్తిని ఇనుమడింపజేసిన జాతీయ గేయకవి, గరిమెళ్ల సత్య నారాయణ స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా ప్రియాగ్రహారం.. 1920 డిసెంబర్‌లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహా సభలో సహాయ నిరాకరణ తీర్మానంతో స్ఫూర్తి పొంది ఆ వీరావేశంతో ఉద్యమంలోకి గరిమెళ్ల ప్రవేశించారు. 'మా కొద్దీ తెల్లదొర తనమూ.. దేవ' రాసిన గీతానికి జైలుశిక్ష అనుభవించారు. ఆ తరువాత బయటకు వచ్చిన ఆయన ప్రజల్లోకి వెళ్లి బ్రిటిష్ వారికి గడగడలాడించే అనేక గేయాలు రాసి పాడి గంభీరంగా పాడి స్ఫూర్తి రగిలించారు. దీనిని గమ నించిన నాటి బ్రిటీష్ అధికారులు ఆయనకు కాకినాడ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ రెండేళ్ల కారాగార శిక్ష విధించారు. ఆయన జైలులో ఉండ గానే 1923లో తండ్రి వెంకటనరసింహం మృతి చెందారు. క్షమాపణ చెబితే విడిచిపెడతామని అధికారులు పేర్కొన్నా దానిని ధిక్కరించి ఆయన శిక్షను పొందారు. కొద్ది రోజుల్లోనే భార్య మరణించారు. అప్పుల పాలై తన ఆస్తులను కూడా విక్ర యించుకోవాల్సి వచ్చింది. ఎన్నో రచనలు చేయడమే కాకుండా ఆల్ఇండియా రేడియో ప్రసా రానికి రచనలు చేశారు. చివరిదశలో ఆరోగ్యం క్షీణించి దుర్భర జీవితాన్ని అనుభవించి మద్రాసు వీధుల్లో భిక్షాటన చేసుకుంటూ గడిపాడు.. స్వాతంత్ర్యానంతరం దేశంలో ప్రబలిన అవినీతికి విసిగి వేసారిన గరిమెళ్ల మిత్రుల్లో కొందరు ఆయనను 'మాకొద్దీ నల్లదొరతనము..' అంటూ కొత్త పాట రాయాల్సిందిగా కోరారు. అయితే, నరనరానా దేశభక్తిని జీర్ణించుకున్న ఆయన అందుకు అంగీకరించలేదు.1952 డిసెంబరు 18న మృతి చెందారు. స్వాతంత్ర్య సమరంలో చేసిన సేవలకు గుర్తు గా 1993లో స్వగ్రామం ప్రియాగ్రహారంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు.

# కాంగ్రెస్‌ను తిడుతూ పోతే ఎలా?

కాంగ్రెస్ ముక్త భారత్ అంటూ మోడీ ఇచ్చిన నినాదం బెడిసి కొట్టింది. ఏదో ఒక పార్టీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తూ పాలన సాగించడం ఉత్తమ నాయకుడి లక్షణం కాదు. కాంగ్రెస్‌ను గత పదేళ్లుగా తిట్టి పోస్తూనే ఉన్నారు. ఆ తిట్లే వారికి వరంగా మారాయి. అందుకే మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సంఖ్య వందకు చేరింది. ప్రతిపక్ష హోదా కూడా లేని స్థాయి నుంచి ప్రతిపక్ష హోదాకు వచ్చారు. అలాగే ఇటీవలి ఉప ఎన్నికల్లో కూడా ఇండియా కూటమి అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ముందుకేసుకుని వాటిని పరిష్కరించకుండా పరజలను మభ్యపెట్టడం వల్ల మోడీ బలహీనం అయ్యారు. అయినా మార్పు కానరావడం లేదు. ఎమర్జెన్సీని రాజ్యాంగ హత్యా దివస్‌గా ప్రకటించడం కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట. ఈ కాలం ప్రజలకు ఇందిర పాలన గురించి పెద్దగా తెలియదు. తెలుసుకునే ఓపిక కూడా లేదు. మోడీ ఏం చేస్తున్నారన్నదే గత పదేళ్లుగా పరిశీలిస్తున్నారు. దేశంలో ప్రధానంగ నిరుద్యోగ సమస్యల విపరీతంగా ఉంది. చదువులు మోయలేని భారంగా మారాయి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మధ్య తరగతి ప్రజలకు జిఎస్టీ వాతలు తట్టుకోలుకుండా ఉన్నాయి. ప్రభుత్వరంగ సంస్థలను తెగనమ్మడం వల్ల మరింత నిరుద్యోగం పెరుగుతుందన్న ఆందోళన కలుగుతోంది. అగ్నివీర్ పథకంతో నాలుగేళ్లకే ఆర్మీ ఉద్యోగాలు పోతున్నాయి. ఇవన్నీ ప్రధాన సమస్యలు. వీటి గురించి ఎక్కడా మాట్లాడడం లేదు. రాజకీయాలు అదేపనిగా చేయరాదు. ఎన్నికల సమయంలో మాత్రమే వాటిని ఉపయోగించాలి. ఇంకా ఇందిర విధించిన ఎమర్జెన్సీ గురించి చర్చిస్తూ..అసలు సమస్యలను పక్కదారి పట్టిస్తే..ప్రజలు కూఅ మోడీని పక్కదారి పట్టించడం ఎలా అన్నది ఆలోచిస్తారు. పెరుగుతున్న జనాభాను తగ్గించడం, ధరలను తగ్గించడం, జిఎస్టీని తగ్గించడం, ఉద్యోగాలు పెంచడం లక్ష్యంగా పనిచేయకుంటే భారత్ మరింత అథఃపాతాళానికి విసిరివేయబడడం ఖాయం. ఈ సమస్యలపై రానున్న పార్లమెంట్ సమావేశాల్లో చర్చించాలి. పరిష్కారాలు కనుగొనాలి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ఈ పదేళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేసే సంకల్పం లోపించింది. అయితే అవినీతి మరక అంటకుండా దేశాన్ని పాలించామని చెప్పుకుంటున్నా..కార్పోరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న తీరుపై సర్వత్రా విమర్శలు ఉన్నాయి. అయితే కాంగ్రెస్ తరహా రాజకీయాలకు పెద్ద ఎత్తున తెరతీసారు. తనవైపు వేలెత్తి చూపే అవకాశం లేకుండా తొలినాళ్లలో పాలన సాగించిన మోడీ ఇప్పుడు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. తన వ్యక్తిగత ప్రతిష్టను పెంచుకునేలా చేసుకుంటున్న తీరు సరికాదు. పాలనలో మాత్రం అంతగా దూసుకుని పోవడం లేదు. ప్రధానంగా నోట్లరద్దు, జిఎస్టీతో ప్రజలకున్న ఆశలు అడియాశల య్యాయి. తాజాగా 2వేల నోట్ల రద్దు కూడా ఇదే కోవలోకి వస్తుంది. ప్రధానంగా ధరల పెరగుదల విషయంలో పట్టింపు లేకుండా పోయాయి. ఆహారధాన్యాలు ఉత్పత్తి అవుతున్నా వాటికి ధరలు దక్కడం లేదు. రైతులు ఆందోళ చేస్తున్నా వ్యవసాయాన్ని బలోపేతం చేసే చర్యలు కానరావడం లేదు. గోదాముల్లో ధాన్యం మగ్గుతున్నా బయటకు రావడం లేదు. అలాగే దిగుమతులు కూడా తగ్గడం లేదు. కాంగ్రెస్ తరహా రాజకీయాలు చేస్తున్నారే తప్ప ఆదర్శ రాజకీయాలకు పెట్టింది పేరయిన బిజెపి ఇప్పుడా ముసుగు నుంచి బయటపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్ఠ మసకబారినా, ప్రధానంగా బిజెపికి రాజకీయాలకు చెరగని మచ్చని తెచ్చి పెట్టాయి. పాలన ఎలా ఉన్నా అవినీతి రహితంగా సాగుతుందన్న పేరు ప్రచారం చేసుకోవడం మినహా ఇతర విషయాలను పెద్దగా పట్టించుకోవడం లేదు. అవినీతి లేకున్నా అక్రమ రాజకీయాలు సాగుతూనే ఉన్నాయి. అమిత్‌షా, మోడీ ద్వయం రాష్ట్రాల్లో చిచ్చు పెట్టి సఫలం అయ్యారు. కాంగ్రెస్ విముక్త భారత్ లక్ష్యంగా చేస్తున్న రాజకీయాలు ఒక్కోసారి వెగటుగా ఉంటాయనడానికి ఇటీవలి పరిణామాలు ఉదాహరణగా చెప్పుకోవాలి. కాంగ్రెస్ పార్టీని దెబ్బతీసే క్రమంలో చేస్తున్న పనులన్నీ దేశహితం కోసమేనని సరిపెట్టు కోలేం. అలాగే గతంలో మీరు చేయలేదా అని ఎదురుదాడి చేయడం ఇటీవల అలవాటయ్యింది. మిగతా నాయకులకు, మిగతా పార్టీలకు, భారతీయ జనతా పార్టీకి చెందిన మోడీ, షాలకు కూడా తేడా లేదని ప్రజలు గుర్తించారు. ఈ క్రమంలోనే తప్పటడుగులు వేస్తున్నారు. దేశమంతటా అన్ని రాష్ట్రాలలో భారతీయ జనతాపార్టీ పతాకం రెపరెపలాడా లన్నది ఈ ఇరువురి నాయకుల కోరిక! కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు నీతి వాక్యాలు వల్లె వేస్తోంది గానీ దేశ రాజకీయాలు ఇవ్వాళ ఇంతలా భ్రష్టుపట్టి పోవడానికి ఆ పార్టీనే ప్రధాన కారణం. గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం కూడా అనేక అడ్డదారులు తొక్కింది. రాష్ట్రాలలో అధికారం నిలబెట్టుకోవడం కోసం లేదా అధికారంలో ఉన్న ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చడం కోసం కాంగ్రెస్ పార్టీ చేయని అరాచకం లేదు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయనపైకి ఇంటెలిజెన్స్ బ్యూరో వంటి సంస్థలను ప్రయోగించి నానా ఇబ్బందులు పెట్టారు. సీబీఐ ద్వారా విచారణలు జరిపించారు. ఇప్పుడు కాంగ్రెస్ అడుగుజాడలలో అదే నరేంద్ర మోదీ, అవే ఏజెన్సీలను కాంగ్రెస్ నాయకుల మీదకు ప్రయోగిస్తున్నారు. పార్టీ ఫిరాయింపు లను ప్రోత్సహించడంలో గానీ, ప్రభుత్వ ఏజెన్సీలను దుర్వినియోగం చేయడంలో గానీ కాంగ్రెస్ ఎప్పుడూ ముందుండేది.ఇప్పుడు అదే పంథాను మోడీ నేతృత్వంలోని బిజెపి అనుసరిస్తోంది. మొత్తంగా బిజెపి కాంగ్రెస్‌కన్నా భిన్నంగా ఉండలేకపోతోంది. ఈ పరిస్థితి మారాలి. దేశం కోసం కష్టపడతానంటున్న మోడీ ప్రధాన సమస్యలను పట్టించుకోవాలి. తాను నిర్మించుకున్న కోటనుంచి బయటకు రావాలి. ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవాలి. ప్రజల కోసం పనిచేయడం అలవాటు చేసుకోవాలి. సామాన్యులు, మధ్య తరగతి ప్రజల బతుకులు దుర్భరంగా మారినవేళ వారిని కష్టాల కొలిమి నుంచి బయటపడేసే మార్గాలను ఆలోచన చేయాలి. అప్పుడే మోడీకి ఆదరణ వస్తుంది.

# ప్రభుత్వాలు కూలుస్తామంటే ఊరుకోవాలా?

## - బండి సంజయ్, కెటిఆర్‌ల తీరుపై మండిపడ్డ పొన్నం

## - భవిష్యత్ తరాల కోసం మొక్కలు నాటాల్సిందేనని వ్యాఖ్య

కరీంనగర్ (ప్రజామంటలు): భవిష్యత్తు తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే మొక్కలు నాటాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌లోని శాతవాహన యూనివర్సిటీలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాల్లో 43 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ అలవాటు అందరి జీవితంలో భాగం కావాలని కోరారు..ప్రభుత్వం మొక్కలు పంపిణీ చేస్తోంది. ఎన్ని చేసినా ప్రజల సహకారం కావాలి. కాలుష్యం తగ్గి వ్యాధులు దరి చేరకుండా ఉండాలంటే అందరూ దీనిపై దృష్టి సారించాలి. ప్రతి మొక్కకూ జియో ట్యాగింగ్ చేయాలి. ఇది ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజల కార్యక్రమంగా, సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. భాజపా ఇప్పటివరకు ఎన్నో ప్రభుత్వాలను కూల్చింది. ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోవాలా? డిసెంబర్ 3 వరకు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే ఆలోచనే లేదు. ప్రభుత్వాన్ని కూల్చుతామని మీరంటుంటే.. నిలబెట్టడానికి వారు వస్తున్నారు. మేం ధర్మం తప్పలేదు.. ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలు. కులగణనపై మరో రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం' అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. బండి సంజయ్, కేటీఆర్ తీరు దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టే ఉందన్నారు. బీజేపీలో చేరాలంటే రాజీనామా చేసి పార్టీలో చేరాలన్న బండి సంజయ్ కు కౌంటర్ ఇచ్చారు పొన్నం. బీజేపీ కూల్చిన ప్రభుత్వాల్లో ఎంత మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే..చూస్తూ ఊరుకోవాలా? అని ప్రశ్నించారు మంత్రి పొన్నం. తాము ధర్మం తప్పలేదని.. కుల గణనపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు. డిసెంబర్ 3 వరకు ఎమ్మెల్యేలను చేర్చుకోవాలన్న ఆలోచన తమకు లేదన్నారు. ప్రభుత్వాన్ని కూల్చుతామని బీఆర్ఎస్ అంటుంటే....నిలబెట్టడానికి ఎమ్మెల్యేలు వస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ సుస్థిరత కోసమే చేరికలని అన్నారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ కు చెందిన 9 మంది ఎమ్మెల్యేలు, ఆరుగుగు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసింది. మరో ఐదారుగురు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్దంగా ఉన్నారని తెలుస్తోంది.

# ఎగువసభలో తగ్గిన బీజేపీ బలం

**- రాజ్యసభలో 20 స్థానాలు ఖాళీ**

**- ఈ యేడే ఎన్నికల నిర్వహణ**

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): ప్రస్తుతానికి రాజ్యసభలో మొత్తం 20 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 11 మంది ఎన్నికైన సభ్యుల స్థానాలు ఉన్నాయి. ఆయా స్థానాలకు ఈ ఏడాదే ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. వీటిలో మహారాష్ట్ర, అసోం, బీహార్‌లలో 2, హర్యానా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, త్రిపురలలో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. బీజేపీ నేతృత్వంలోని కూటమి అసోం, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, త్రిపురలలో 7 సీట్లు గెలిచే అవకాశం ఉంది. ఇక మహారాష్ట్రలోనూ రెండు స్థానాలు గెలిచే ఛాన్స్ ఉంది. ఈ ఏడు స్థానాలు, నామినేటెడ్ సభ్యులకు తోడు వైసీపీ మద్దతు ఇస్తే ఎన్డీయే కూటమి బిల్లులను గట్టెక్కించుకోగలుగుతుంది. ప్రస్తుత రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 225గా ఉంది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బలం 87గా ఉంది. కాంగ్రెస్‌కు 26, తృణమూల్ కాంగ్రెస్‌కు 13, ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే పార్టీలకు చెరో 10 మంది చొప్పున రాజ్యసభ ఎంపీలు ఉన్నారు. ఇక ఎన్డీయే, ఇండియా కూటములలో లేని బీఆర్ఎస్ వద్ద నలుగురు, పలువురు స్వతంత్రులు ఉన్నారు. ఎన్డీయే పార్టీలైన టీడీపీ, జేడీయూలతో కలిసి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీజేపీ బలం రాజ్యసభ లోనూ తగ్గింది. నామినేటెడ్ ఎంపీలైన రాకేశ్ సిన్హా, రామ్ షకల్, సోనాల్ మాన్‌సింగ్, మహేశ్ జెత్మలానీల పదవీకాలం శనివారంతో పూర్తయింది. అధికార పార్టీ సలహా మేరకు ఈ నలుగురిని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. ఆ నలుగురు ప్రధాని మోదీ సారధ్యంలోని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారు. శనివారంతో వీరి పదవీకాలం ముగిసిపోవడంతో రాజ్యసభలో బీజేపీ ఎంపీల సంఖ్యాబలం 86కి పడిపోయింది. పర్యవసానంగా మొత్తం 245 మంది సభ్యులు ఉన్న రాజ్యసభలో ఎన్డీయే కూటమి సంఖ్యాబలం 101కి పడిపోయింది. రాజ్యసభ మెజారిటీ మార్క్ 113 కంటే ఎన్డీయే ఎంపీల సంఖ్య ఇంకా తక్కువగానే ఉంది. ఎగువ సభలో సంఖ్యా బలం తగ్గడంతో అధికార ఎన్డీయే కూటమి బిల్లులను ఆమోదం కోసం ఇతర పార్టీలపై ఆధారపడాల్సి ఉంటుంది. తమిళనాడులోని అన్నాడీఎంకే, ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్‌సీపీ వంటి పార్టీలను ఆశ్రయించాల్సి ఉంటుందని రాజకీయ నిపుణులు విశ్లేషిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ వద్ద 11, అన్నాడీఎంకే వద్ద 4 మంది సభ్యులు ఉన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ-జనసేనతో బీజేపీ కలవడంతో వైసీపీ దూరమైనప్పటికీ మళ్లీ ఆ పార్టీని బీజేపీ సంప్రదించాల్సిన పరిస్థితి రావొచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో కూడా వైసీపీ ఇదే పనిచేసింది. బీజేపీ ప్రభుత్వానికి అనేక బిల్లుల విషయంలో మద్దతు తెలిపింది. కాబట్టి మరోసారి బిల్లుల విషయంలో వైసీపీని బీజేపీ సంప్రదించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సారధ్యంలోని బీజేపీ కూడా గతంలో ఇదే విధంగా బీజేపీకి మద్దతు ఇచ్చింది. అయితే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలోనే ఆ పార్టీ ఓడిపోయింది. కాబట్టి ఇప్పుడు బీజేపీకి బీజేడీ సభ్యులు మద్దతు ఇవ్వడం సందేహమేనని చెప్పాలి. బీజేడీ వద్ద 9 మంది రాజ్యసభ ఎంపీలు ఉన్నారు.

# ఎస్‌బీఐ వడ్డీరేట్లు పెంపు

## వెంటనే అమల్లోకి వచ్చిన నిర్ణయం

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): దేశీయ అతిపెద్ద బ్యాంక్ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' నిధుల వ్యయం ఆధారిత రుణ వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు సోమవారం వెల్లడించింది. కొన్ని కాలపరిమితులపై ఎంసీఎల్‌ఆర్‌ను 10 బేసిస్ పాయింట్ల (0.10 శాతం) వరకు పెంచింది. సవరించిన రేట్లు సోమవారం నుంచే అమలవుతాయని ఎస్‌బీఐ తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఏడాది కాలవ్యవధి గల ఎంసీఎల్‌ఆర్‌ను 8.75 శాతం నుంచి 8.85 శాతానికి, ఆరు నెలల కాలవ్యవధికి 8.65 శాతం నుంచి 8.75 శాతానికి, రెండేళ్లకు 8.85 శాతం నుంచి 8.95 శాతానికి, మూడేళ్ల కాలపరిమితి 8.95 శాతం నుంచి 9 శాతానికి ఎస్‌బీఐ పెంచింది. దీంతో ఎంసీఎల్‌ఆర్ ఆధారిత లోన్ల ఈఎంఐలు మరింత భారం కానున్నాయి. ఎస్‌బీఐ ఆటో రుణాలు ఒక సంవత్సరం, వ్యక్తిగత రుణాలు 2 సంవత్సరాల ఎంసీఎల్‌ఆర్‌కు అనుసంధా నించి ఉన్నాయి. ఎంసీఎల్‌ఆర్ అనేది ప్రామాణిక రుణ రేటు. నిధుల సేకరణకు బ్యాంకులకు అయ్యే వ్యయం, నిర్వహణ వ్యయం, క్యాష్ రిజర్వు రేషియో (సీఆర్‌ఆర్), కాలపరిమితి, ప్రీమియంలను పరిగణలోకి తీసుకుని ఎంసీఎల్‌ఆర్‌ను లెక్కిస్తారు. బ్యాంకులు ఎంసీఎల్‌ఆర్ కంటే తక్కువకు రుణం అందించే అవకాశం ఉండదు. వివిధ కాలపరిమితులకు (ఓవర్ నైట్ నుంచి మూడేళ్ల వరకు) ఎంసీఎల్‌ఆర్ వేర్వేరుగా ఉంటుంది.

## వ్యాసకర్తలకు వినతి

**రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై వ్యాసాలు పంపేవారు మీ వ్యాసాలను వీలైనత క్లుప్తంగా, వివరణాత్మకంగా, 350-400 ల పదాలకు పరిమితం అయి ఉండేలా చూడండి. పెద్ద వ్యాసాలను పరిశీలించనడం సాధ్యం కాకపోవచ్చని గ్రహించగలరు. వర్డ్ డాక్యుమెంట్, లేదా ఓపెన్ ఫైల్ లో, ఈ మెయిల్ కు మాత్రమే పంపగలరు.**

mantalukathalu@gmail.com

-ఎడిటర్

# రాజకీయాల్లో చెరగని ముద్ర తేళ్ల లక్ష్మీకాంతమ్మ

## జూలై 16.. తేళ్ల లక్ష్మీకాంతమ్మ జయంతి



తేళ్ల లక్ష్మీకాంతమ్మ... ఈ పేరు ఈ తరం తెలుగు వారికి అంతగా తెలియక పోవచ్చు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఆరున్నర దశాబ్దాల క్రితం లోకసభకు ఎన్నికై...నెహ్రూ, శాస్త్రి లాంటి నాటి కాంగ్రెస్ అగ్ర నాయకుల అభిమా నాన్ని చూరగొని, తర్వాత ఇందిరా గాంధీ, పి.వి. నరసింహా రావు లాంటి ప్రధానులకు చేరువై, మహిళా పక్షపాతిగా పేరెన్నిక గన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఏనాడూ డిపాజిట్ రాని, ఒకనాటి కమ్యునిస్టు కంచుకోట అయిన ఖమ్మం నుండి లోక సభకు పోటీ చేసి తొలి విజయం నమోదు చేసి, అదే ఊపులో మరో రెండు సార్లు విజయ దుందుభి మోగించి కాంగ్రెస్ జెండాను రెపరెప లాడించిన రికార్డు ఆమెదే.

ఆమె రాజకీయ ఆరంగేట్రం ఎలా జరిగింది అంటే...1957లో తనకు ఎమ్మెల్యే టిక్కెట్ కావాలని కాంగ్రెస్ పార్టీని అడిగిన సందర్భంలో ఆమె భర్త ఒక ప్రభుత్వ అధికారి అయిన కారణం తో, ఆమెకు టికెట్ నిరాకరించారు. తాను ముందుగా భారత పౌరురాలినని, తర్వాతే అధికారి భార్యనని వాదించి, లాల్ బహదూర్ శాస్త్రిని మెప్పించి ఒప్పించి ఖమ్మం లోకసభ స్థాన టికెట్ పొందారు.

అసలు కాంగ్రెస్ కు అంతకుముందు డిపాజిట్లు కూడా దక్కని సీటులో ఆమె పోటీ చేయడం, గెలవడం ఏమిటని చర్చల నేపథ్యంలో అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తి, ఔరా అనిపించి ఆ సీటులో గెలిచి చూపించారు తేళ్ల లక్ష్మీకాంతమ్మ.

1957, 1962, ఆ తర్వాత లోక్ సభ ఎన్నికల్లోనూ లక్ష్మీకాంతమ్మ వరుసగా మూడుసార్లు ఖమ్మం ఎంపీగా గెలిచారు. నెహ్రూ ప్రభు త్వంలో పార్లమెంటు కమిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా పని చేశారు. అలాగే ఆమె తనకు వచ్చిన అవకాశాన్ని వినియోగించి, అప్పటిదాకా సివిల్స్ లో మహిళ లకు ప్రవేశం లేని స్థితిలో, ఇందిరా గాంధీని ఒప్పించి సివిల్స్ లో మహిళ లకు అవకాశం లభించేలా చేశారు. మహిళలకు సమాన ఆస్తి హక్కు కోసం పార్లమెంటులో అనేక సార్లు మాట్లాడారు. 1972లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సభ్యురాలిగా మహిళలు, యువకులకు ఎక్కువ టిక్కెట్లు వచ్చేలా కృషి చేశారు.

తెలంగాణ రాష్ట్రానికి చెందిన తేళ్ల లక్ష్మీకాంతమ్మ 1924, జూలై 16న జోగులాంబ గద్వాల జిల్లా, ఆలంపూర్ లోని కమ్మ భూస్వా ముల కుటుంబానికి చెందిన వెంకట్ రెడ్డి - మంగమ్మ దంప తులకు జన్మించారు. 5వ తరగతి వరకు కర్నూలులో చదివి, గుడివాడలో ఎస్ఎస్ఎల్‌సీ, ఇంటర్మీడియట్ మద్రాసు క్రిస్టియన్ కాలేజీలో, మచిలీ పట్నంలో బిఏ, బెనారస్ హిందూ విశ్వ విద్యా లయం నుండి 1971లో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఏ పట్టా పొందారు. ఆమె 1944, నవంబరు 1న అనంతపురం జిల్లా అటవీ అధికారి టి.వి.సుబ్బారావును వివాహం చేసుకున్నారు.

లక్ష్మీకాంతమ్మ ఖమ్మం నియోజక వర్గం నుండి 1957లో ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికై, ఆ తర్వాత 1962లో, ఆ తర్వాత ఖమ్మం లోకసభ నియోజకవర్గం నుండి వరుసగా మూడుసార్లు ఎన్నికై 1977వరకు లోక్‌సభలో ఖమ్మంకు ప్రాతినిధ్యం వహించారు. 1967లో పార్లమెంటు బృందంలో సభ్యురాలిగా ఆస్ట్రేలియా పర్యటించారు. 1978లో జనతా పార్టీ తరపున హైదరాబాదు నగరంలోని హిమాయత్ నగర్ శాసనసభా నియోజకవర్గం నుండి గెలుపొందారు. ఆమె తెలుగులో ప్రగతి పథంలో మహిళలు అనే పుస్తకాన్ని, ఆంగ్లంలో కో-ఆపరేషన్ టుడే అండ్ టుమారో అనే పుస్తకాల్ని ప్రచురించారు. బాద్షా ఖాన్ జీవితచరిత్రను తెలుగులోకి అనువదించారు.



రామ కిష్టయ్య సంగన భట్ల

9440595494

తాను రాష్ట్రపతిగా ఎన్నిక కావడంలో తేళ్ల లక్ష్మీకాంతమ్మ పాత్ర కీలకమని తన జీవిత చరిత్రలో చెప్పుకున్నారు దివంగత రాష్ట్రపతి వి.వి.గిరి. ఇందిరాగాంధీకి ఆమెతో ఉండిన సాన్నిహిత్యం దృష్ట్యా, ఎన్నిసార్లు అడిగినా కేంద్ర మంత్రి పదవి స్వీకరించ లేదని, ఒక దశలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి ఇస్తామని ఇందిరా గాంధీ ప్రతిపాదించినా, ఆమె అంగీక రించక, మేధావి, అనుభవజ్ఞుడు అయిన పీవీ అయితేనే బాగుం టుందని చెప్పారని, పీవీ నరసింహా రావు ముఖ్యమంత్రి కావడానికి లక్ష్మీ కాంతమ్మ ఒక విధంగా కారణమని ఆ రోజుల్లో చెప్పుకునే వారు.

ఇందిరాగాంధీకి అంత సన్నిహి తురాలు అయినా, ఇందిర విధించిన ఎమర్జెన్సీని తీవ్రంగా వ్యతిరేకించి, లక్ష్మీకాంతమ్మ కాంగ్రెస్ ను వీడి, జనతాపార్టీలో చేరి, కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. హైదరాబాద్ లో హిమా యత్ నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. హైదరాబాద్ లో బీహెచ్ఈఎల్, కొత్తగూడెం థర్మల్ ప్రాజెక్ట్, వైజాగ్ స్టీల్ ప్లాంట్ రావడంలో ఆమెది కీలక పాత్ర అని చెబుతుంటారు. 2007 డిసెంబర్ 13న 83 ఏళ్ల వయసులో మరణించారు.

# రాజకీయల కొరకే నిరుద్యోగులతో చెలగాటం

## ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి - తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ....నిరుద్యోగ యువకులు కొన్ని రాజకీయ పార్టీలు, కొంత మంది రాజకీయ నాయకుల ప్రొద్బలం వల్ల ఆందోళనలు చేస్తున్నారును అన్నారు. ఇంకా, రెచ్చ గొట్టి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు. కొందరు రాజకీయ నాయకులు ఆర్టిఫిషియల్ కృత్రిమ ఉద్యమాలు చేయిస్తున్నారు. విద్యార్థుల బలిదానం, త్యాగాలను గుర్తించి తెలంగాణను సోనియా గాంధీ ఇచ్చారు. లక్ష 7 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఆ రోజు కేసీఆర్ చెప్పారు. వాటిని భర్తీ చేయకుండా కేసీఆర్ దిగిపోయే నాటికి చనిపోయే వారిని కలుపుకుంటే రెండు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. నిరుద్యోగుల పైన ప్రేమ ఉంటే ఉద్యమంలో విద్యార్థుల ప్రాణ త్యాగాలతో తెచ్చుకున్న తెలంగాణలో అప్పటి ముఖ్యమంత్రి అయిన కేసీఆర్ మూడు నెలల్లో ఉద్యోగాలు నింపవచ్చు. కాని కేసీఆర్ ఉద్యోగాలు భర్తీ చేయలేదు... తెలంగాణలోని యూనివర్సిటీలలో టీచింగ్ స్టాఫ్ లేదు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రతిష్ట అడుగంటి పోయేలా చేసింది కేసీఆర్ సర్కార్. శతాబ్ది ఉత్సవాలకు కేసీఆర్ ను ఉస్మానియాలో యూనివర్సిటీ విద్యార్థులు మాట్లాడనియ్యలేదు. కాంగ్రెస్ పార్టీ ఇటీవలి ఎన్నికల కంటే ముందు రెండు లక్షల ఉద్యోగాలు ఒక సంవత్సరంలో భర్తీ చేస్తామని చెప్పింది. ప్రభుత్వం వచ్చిన వెంటనే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. గ్రూప్ వన్ నోటిఫికేషన్ వచ్చింది.. పరీక్షలు రాశారు.. రిజల్ట్స్ కూడా వచ్చాయి. మెయిన్స్ షెడ్యూల్ కూడా ఇచ్చాము. పది సంవత్సరాలలో 20,000 టీచర్ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే ఒక్కటి కూడా గత బీ ఆర్ ఎస్ ప్రభుత్వం భర్తీ చేయలేదు. ఒక్క డీఎస్సీ కూడా వేయలేదు. పక్కన ఏపీ రాష్ట్రంలో మూడు డిఎస్సి లు వేశారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్లలో విద్యార్థులకు అన్యాయం చేసింది బీఆర్ఎస్ సర్కార్.సర్కార్ రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగాల భర్తీపై దృష్టి సారించారు.నిరుద్యోగుల కోసం 11 వేల పైచిలుకు పోస్టులతో పలు నోటిఫికేషన్స్ ఇచ్చారు. హాల్ టికెట్లు కూడా విడుదల చేశాము. గత బీఆర్ఎస్ సర్కార్ 10 ఏళ్లలో 5000 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నిర్వహించలేకపోయింది. ఈ డీఎస్సీ తో పాటు మరో డీఎస్సీని 9,000 ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇస్తాం. క్వాలిటి టీచర్స్ ఎంపిక కోసం రెండు డీఎస్సీలను నిర్వహించాలని అనుకుంటున్నము.తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకొని రాష్ట్రాన్ని దివాలా తీయించిన కెసిఆర్, హరీష్, కేటీఆర్, మళ్ళీ పిల్లలు జీవితాలతో ఆడుకునే ప్రయత్నం చేస్తున్నరు. బీఆర్ఎస్ వాళ్ల చేతులలో విద్యార్థులు, నిరుద్యోగులను పావులుగా మారొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. మళ్లీ విద్యార్థులను నిరుద్యోగులను వాళ్ళు వాడుకొని వదిలేస్తరు. 30 లక్షల మంది చదువుకున్న నిరుద్యోగులు ఎంప్లాయ్మెంట్ ఎక్స్చేంజిలలో పేర్లు నమోదు చేసుకున్నరు. టాటా కంపెనీతో ఒప్పందం చేసుకొని 64 ఐటిఐ సెంటర్స్ లో అడ్వాన్స్ స్కిల్ డెవలప్మెంట్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నము. 2,000 కోట్ల రూపాయలు ఐటిఐ లకు కేటాయించడం జరుగుతుంది. స్కిల్ డెవలప్మెంట్ తో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కలిపి 30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుంది. ముఖ్యమంత్రి ఇంటికి పోయి ధర్నా చేయడం సరికాదని విజ్ఞప్తి చేస్తున్న. కోచింగ్ సెంటర్ల వాళ్లు కొంతమంది విద్యార్థులను ప్రేరేపించి ఆందోళన చేయిస్తున్నరు. ప్రజావాణిలో దరఖాస్తులకు దరఖాస్తు చేసిన 10 రోజులలో రిజల్ట్స్ కూడా వస్తున్నయి. అవసరమైతే అధికారులను ప్రజా భవన్ కు రప్పిస్తున్నాం. విద్యార్థులు, నిరుద్యోగులు బాధ చెప్పుకోవాలనుకుంటే ప్రజావాణికి వచ్చి బాధ చెప్పుకోమని కోరుతున్నాం.. మీకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని కోరుతున్నాను. పదేళ్లు తెలంగాణలో డిక్టేటర్స్ పాలన నడిచింది. కెసిఆర్ ఇనప కంచెలు వేసి ప్రగతి భవన్ రానీయకుండా చేశాడు. బుల్డోజర్లు పెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇనుపకంచెలు తొలగించారు. 1: 100, వాయిదా వేయడం, పరీక్షకు పరీక్షకు మధ్య గ్యాప్ వంటి సమస్యలపై కలిసి మాట్లాడితే బాగుండేది. ఫీజు రియంబర్స్మెంట్ మొత్తం కూడా త్వరలోనే విడుదల చేయబోతున్నాం. కృత్రిమ ఉద్యమాలు కేసీఆర్ సృష్టిస్తున్నరు. కెసిఆర్ చిల్లర రాజకీయాలు మానుకోవాలి. 30 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. స్కిల్ డెవలప్మెంట్ సెంట్రల్ ఏర్పాటు చేయబోతున్నాం. విద్యా, వైద్యం, వ్యవసాయం ప్రధాన ప్రాధాన్యతగా ప్రభుత్వం ముందుకెళ్తుంది. గత ప్రభుత్వం ఖజానా పూర్తిగా ఖాళీ చేసి వెళ్ళిపోయింది. ఇలాంటి పరిస్థితులలో కూడా ప్రభుత్వం ఎంతో గొప్పగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దీన్ని ఆలోచించాలి. విద్యార్థులు తప్పుడు మాటలు వినకండి. తప్పుదోవ పట్టకండి. ఈ ప్రభుత్వం నిరుద్యోగులకు, విద్యార్థులకు అండగా ఉంటుంది.



# అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

రాయికల్ జూలై 15 (ప్రజామంటలు): మూడు నెలలు గడిచిన అక్రమ నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సోమవారం పట్టణంలోని హిందూ ధార్మిక సంఘాల సభ్యులు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని పోచమ్మ గుడి ముందు గతంలో అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తిపై తగు చర్యలు తీసుకొని, అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని మునిసిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేసినప్పటికీ నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గత కొన్ని సంవత్సరాల నుండి సంబంధిత నిర్మాణం ముందు హిందువుల ఆరాధ్య దైవం శివునికి అర్చించే బిల్వపత్ర వృక్షాన్ని కూడా సంబంధిత వ్యక్తి 90శాతానికి పైగా నరికి వేయడం పై తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు కోర్టు ఉత్తర్వులు, మున్సిపల్ నిబంధనలు బేఖాతరు చేసిన వ్యక్తిపై తగు చర్యలు తీసుకొని వెంటనే అక్రమ నిర్మాణాన్ని చట్ట ప్రకారం తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ ధార్మిక సంఘాల సభ్యులు మరియు కుల సంఘాల సభ్యులు కాయితి గంగాధర్, పందిరి లక్ష్మీనారాయణ, గంగాధర్, సామల సతీష్, జోగా రవీందర్, వినయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపైన వ్యాపారస్తుల సైన్ బోర్డులు తొలగించిన మున్సిపల్ సిబ్బంది



జగిత్యాల జులై 15 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారుల ఇరుపక్కల షాపులలో వ్యాపారాలు నిర్వహించే వివిధ షాపుల వారు వారికి సంబంధించిన అడ్వటైజ్మెంట్ సైన్ బోర్డులను, మరియు ప్రదర్శనలో ఉంచే వస్తువుల స్టాండ్లను రోడ్డుపైనే ఉంచడంతో సోమవారం సాయంత్రం 6 గంటలకు క్షేత్ర పర్యటన చేసిన మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మున్సిపల్ సిబ్బందితో మోచి బజార్ నుండి టవర్ సర్కిల్ వరకు రోడ్డుపైనే ఉన్న సైన్ బోర్డులను తొలగించి ట్రాక్టర్ ద్వారా మున్సిపల్ కార్యాలయానికి తరలించారు.

# పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత

### వన మహోత్సవంలో ప్రజలు భాగస్వాములు కావాలి



జగిత్యాల జులై 15 (ప్రజామంటలు): ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వనమహోత్సవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న వనమహోత్స కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఈద్గా దగ్గర ఐపిఎస్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో వనమహోత్సవం కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జగిత్యాల మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పాల్గొన్నారు. అనంతరం ఛైరపర్సన్ మాట్లాడుతూ.... పర్యావరణాన్ని రక్షించడం అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. వన మహోత్సవానికి సరిపడా మొక్కలు అందుబాటు లో ఉంచుకోవాలని, ప్రజలకు అవసరమైన మొక్కలు అందించి ఇంటి పరిసరాల్లోని ఖాళీ స్థలాలో నాటేలా చూడాలన్నారు. నాటిని వాటి సంరక్షణ గురించి తెలియజేయాలని ఆదేశించారు. పెరిగిన మొక్కలు నరికి వేయడం వలను ప్రకృతికి నష్టం జరుగుతుందని, పట్టణంలో చెట్లను నరికి వేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. మొక్కలు నాటడడంతో ప్రకృతిని కాపాడినవారువుతారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు కాంగ్రెస్ నాయకులు కౌన్సిలర్స్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ గిరి నాగభూషణం కౌన్సిలర్ దుర్గయ్య స్కూల్ యాజమాన్యం విద్యార్థులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

(రామ కిష్టయ్య సంగన భట్ల)





ధర్మపురి జులై 15 (ప్రజామంటలు): ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి కొన్నేళ్ల కిందట ఒక్క చోట చదువుకున్న ఒకనాటి సహచారు లైన పూర్వ విద్యార్థులు చాలా సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనాల పేరుతో కలుసు కోవడం ఈ మధ్య సాధారణమే అవుతున్నాయి. అయితే ప్రస్తుతం 70ఏళ్లకు పైబడిన వృద్దులు, 55 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న ఒకనాటి మిత్రులు సుదీర్ఘ కాలానంతరం ఒక్క చోట కలిసి, తమ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ గడపడం ఒకింత అసాధారణమే. సుప్రసిద్ధ ధర్మపురి క్షేత్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో1968-69 విద్యా సంవత్సరంలో హెచ్ ఎస్ సి ( నాటి హయ్యర్ సెకండరీ సర్టిఫికెట్) చదువుకున్న ఒకనాటి మిత్రులు సోమవారం ధర్మపురి క్షేత్రంలో అపురూపంగా కలుసు కున్నారు. తమ అనుభూతులను, జ్ఞాపకాలను పంచుకొన్నారు. యాభై ఐదు సంవత్సరాల క్రితం చదువుక్నొ వీరు అంతా డెబ్భై సంవత్సరాలు పైబడిన వారే కావడం విశేషం. శ్రీ లక్ష్మీ నరసింహ సంస్కృత ఆంధ్ర కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డా. సంగనభట్ల నరసయ్య నేతృత్వంలో సమావేశమై, తొలుత తమను విడి పోయిన, డివంగతులైన విద్పార్థులను, అధ్యాపకులను స్మరించి, శ్రద్ధాంజలి ఘటించారు. 25మంది నాటి సహచర విద్యార్థులు, తాము కలవడానికి చొరవ శ్రమ తీసుకున్న, చిరునామాలను సేకరించిన డాక్టర్ సంగన భట్ల నరసయ్య, మాదాసు రమేశ్ బాబు, నంబి జనార్ధన్, ఆకుతోట రమణా రెడ్డి, జమ్మల మడక వేంకట దత్తాత్రిల కృషిని అభినందించారు. ప్రస్తుత వారి స్థితిగతులతో బాటు నాటి తీపి గుర్తులను జ్ఞాపకం చేసుకున్నారు. చైతన్య భారతి పాఠశాల సంస్థాపకులైన సంగన భట్ల రామ కిష్టయ్య విశిష్ట అతిధిగా పాల్గొని, ఆయన చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు. డాక్టర్ నరసయ్య రచించిన పి.వి. నర్సింహారావు, భగవద్గీత వంటి పుస్తకాలను అందరికీ వివర ణ చేసారు. సామాజిక సేవకై నిర్ణయించు కొని, తను అధ్యాపకులైనా వయో వృద్దులు ఇంద వరపు నర్సింగరావు ఇంటికి వెళ్లి వారిని సన్మానించుకొని ఆశీస్సులు అందుకొన్నారు.

# అమ్మ మాట- అంగన్వాడి బాట



గొల్లపల్లి జులై 15 (ప్రజామంటలు): గొల్లపల్లి మండలంలోని రంగధామునిపల్లి కోసనపల్లి అంగన్వాడి కేంద్రాలలో అమ్మ మాట అంగన్వాడి బాట సూపర్వైజర్ ఆధ్వర్యంలో స్లొగన్స్ తోర్యాలీ స్కూల్ పిల్లలు, పంచాయతీ సెక్రెటరీ, ప్రధానోపాధ్యాయులు, ఎస్.హెచ్.జి. మహిళా సంఘం వి.ఒ, ఆశ వర్కర్, తల్లులతో నిర్వహించారు. 15 నుండి 20 వరకు అమ్మ మాట-అంగన్వాడి బాట నిర్వహించడం జరుగుతుంది దీనిలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలలో పిల్లల యొక్క నమోదు సంఖ్యను పెంచే విధంగా గ్రామంలో ర్యాలీ ద్వారా గ్రామస్తులకు అవగాహన కలిగించడం ఆరు నెలలు దాటిన బాబుకు అన్నప్రాసన కార్యక్రమము నిర్వహించడం తల్లిపాలతో పాటు అనుబంధాహారము ప్రతిరోజు ఇవ్వవలెనని పిల్లల యొక్క పెరుగుదల బావుంటుందని వివరించడం పూర్వ ప్రాథమిక విద్య ద్వారా పిల్లలలో శారీరక మానసిక సాంఘిక మేదో వికాస అభివృద్ధిలు జరుగుతాయని తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలను చేర్పించవలెనని అవగాహన కలిగించనినది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వర్, సుధాకర్ రెడ్డి, సౌమ్య, వివో మల్లవ్వ, రాధ, ఆశా వర్కర్ రమ, అంగన్వాడీ టీచర్స్, రమాదేవి రాజేశ్వరి, తల్లులు, పిల్లలు, ఆయాలు పాల్గొన్నారు.

# బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే కార్యక్రమం: ఎస్పీ అశోక్ కుమార్

## బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం

జగిత్యాల జులై 14 (ప్రజామంటలు): ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. భూ తగాదాలు,ఆస్థి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని అధికారులకు సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు.





## వలస వచ్చిన పిల్లలను బడిలో చేర్పించిన ఆపరేషన్ ముష్కాన్ - ఎక్స్

జనగామ జూలై 15 (ప్రజామంటలు):
పని కోసం వలస వచ్చిన టుంబాల పిల్లలని ఆపరేషన్ ముష్కాన్ – ఎక్స్ జనగామ డివిజన్ టీం సోమవారం బడిలో చేర్పించారు. నగామ డివిజన్ పరిధిలోని ఆపరేషన్ ముష్కాన్ –ఎక్స్–టీంజనగామలో పర్యటిస్తున్న సందర్భంలో నూతనంగా నిర్మిస్తున్న జనగామ మెడికల్ కాలేజ్ లో జీవనోపాధికోసం వలస వచ్చిన ఉత్తర్ ప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఒడిషా రాష్ట్రాలకి చెందిన పలు కుటుంబాలకు చెందిన సుమారుగా 14 మంది చదువు మానేసిన విద్యార్థులను గుర్తించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చి 6 విద్యార్థులను సమీపంలో ఉన్న జడ్పిహెచ్ఎస్ బాలికల పాఠశాలలో వివిధ తరగతులలో చేర్పించారు. ఈ ఆపరేషన్ లో జనగామ ఎస్ఐ తిరుపతి, పోలీస్ విభాగం నుండి బాలాజీ హెచ్.సి. హిదాయత్ ఆలీ హెచ్సి , విద్య లక్ష్మి డబ్ల్యుపిసి, చైల్డ్ డిపార్ట్మెంట్ నుండి ప్రణయ్, రంజిత్ కుమార్, స్కోప్ స్వచ్ఛంద సంస్థ నుండి ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ మనోజ్ కుమార్, సిఎస్ డబ్ల్యు తాబస్సుమ్, విద్యాశాఖ ఎంఎన్ఓ రాజేందర్, హెచ్ఎం.శంకర్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## దోమల నివారణ అందరి బాధ్యత కార్పొరేటర్ కంది శైలజ

సికింద్రాబాద్ జూలై 15 (ప్రజామంటలు):
ప్రస్తుత వర్షాకాలంలో ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతగా ఉంచడంలో భాగస్వాములు కావాలని బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ పేర్కొన్నారు. దోమల వ్యాప్తి%-% డెంగ్యూ జ్వరాలతో ముప్పు అంశంపై సోమవారం బౌద్ధనగర్ డివిజన్ లోని పార్శీగుట్టలోని మదర్ మేరీ స్కూల్ లో స్టూడెంట్స్ కు అవెర్నెస్ నిర్వహించారు. ఈసందర్బంగా దోమల వ్యాప్తి, వ్యాధుల పై ఎంటమాలజీ అధికారులు వారికి పలు జాగ్రత్తలు వివరించారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడే గా పాటించాలని, ఇండ్లు, ఆఫీసుల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, నీటిలో ఉండే నేటి తోక పురుగులే, రేపటి దోమలుగా మారుతాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ కిరణ్, రెడ్ క్రాస్ ఆసుపత్రి డాక్టర్ ఎలిజబేత్, జీహెచ్ఎమ్సీ ఎంటమాలజీ సిబ్బంది, ఆశా వర్కర్లు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.



రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయాల సేకరణ నేపథ్యంలో హన్మకొండలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కు పూల మొక్కతో స్వాగతించిన జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

# బీసీ నాయకుల ముందస్తు అరెస్టును ఖండిస్తున్నాం

## బిసి రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మినారాయణ




జగిత్యాల జూలై 15 (ప్రజామంటలు):
హైదరాబాద్ లో గత 10 రోజుల నుండి జరుగుతున్న నిరుద్యోగుల ధర్నా కు మద్దతుగా సోమవారం హైదరాబాదుకు తరలివెళ్తున్న బి.సి. నాయకులను అరెస్టు చేసి జగిత్యాల పోలీసు స్టేషన్ కు తరలించినారు. ఈ సందర్భంగా బిసి రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మినారాయణ మాట్లాడుతూ.... గడిచిన 10 సంవత్సరాల నుండి ఎలాంటి ఉద్యోగాలు లేక యువత అల్లాడుతుంటే ఒక పక్క వయోపరిమితి దాటిపోతుందనే భయం, మరో పక్క డి.ఎస్.సి. పెడతారో లేదో అనే భయంతో యువత గత 12 రోజులుగా నిరుద్యోగులు రోడ్ల పక్కన ధర్నాలు చేస్తుంటే ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేకుండా పోయిందని నిరుద్యోగ విద్యార్థులపై లాఠీ చార్జి చేస్తూ అక్రమ అరెస్టులు చేస్తూ, బి.సి, ఎస్సీ, ఎస్టీ ఓట్లతో గెలిచిన 6 నెలలు గడుస్తున్నా ఎలాంటి ఉద్యోగాలు ఇవ్వకుండా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై, డి.ఎస్.సి. అభ్యర్థులపై లాఠీ చార్జి చేసి ఆపై అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బిసి సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. లేనిచో నిరుద్యోగ విద్యార్థులతో రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, బి.సి యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచందర్, బిసి జిల్లా ఉపాధ్యక్షుడు గుంటి గంగారాం, బిసి సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు రాపర్తి రవి, బిసి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన మోత్కూరి శ్రీనివాస్



ఇల్లందకుంట జూలై 15 (ప్రజామంటలు):
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు ఏలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండే విధంగా కాటమయ్య రక్షణ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కల్లుగీత కార్మికులకు రక్షణ కిట్లను అందజేసినందుకు హుజురాబాద్ నియోజకవర్గం గౌడ సంఘం గౌడ కుటుంబాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని కల్లు గీత కార్మిక సంఘం నియోజకవర్గ ప్రచార కార్యదర్శి బీసీ సంక్షేమ సంఘం ఇల్లంతకుంట మండల అధ్యక్షులు మోత్కూరు శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మీడియాతో శ్రీనివాస్ మాట్లాడుతూ.... తాడిచెట్టు ఎక్కుతున్న క్రమంలో అనేకమంది కల్పిత కార్మికులు చెట్లపైడి జారిపడి మరణాలు అంగవైకల్యం చెంది కుటుంబాలను పోషించుకోలేని పరిస్థితిలో ఉన్నాయని ఇలాంటి పరిస్థితులు మళ్లీ రాష్ట్రంలో ఉండకూడదు అనే ఉద్దేశంతో సీఎం, పొన్నం ప్రభాకర్ గౌడ్ కాటమయ్య రక్షణ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో తీసుకువచ్చినందుకు గౌడ సంఘం గౌడ కుల సభ్యుల తరఫున ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు.

# బోయగూడ లో మ్యాన్ హెూల్స్ ధ్వంసంతో ప్రమాదాలు

### కారకులపై చర్యలు తీసుకోని జీహెచ్ఎమ్సీ అధికారులు

### రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న బైకిస్ట్ లు



సికింద్రాబాద్ జూలై 15 (ప్రజామంటలు):
బన్సీలాల్ పేట డివిజన్ లోని బోయిగూడ ప్రాంతంలోని వెటర్నరీ ఆసుపత్రి లైన్ లో కొత్తగా నిర్మిస్తున్న నెం. 6%-2-%121 బాలాజీ నాన్జీ మెహపిల్ అపార్ట్ మెంట్ నిర్మాణపనుల్లో నిర్లక్ష్యం కారణంగా రహదారిపై నున్న రెండు డ్రైనేజీ మ్యాన్ హెూల్స్ కవర్లు ధ్వంసం అయ్యాయి. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ రహదారిపై ప్రయాణిస్తున్న పలువురు ధ్వంసమైన మ్యాన్ హెూల్స్ వద్ద బైక్ ల పైనుంచి స్కిడ్ అయి కింద పడి గాయాల పాలవుతున్నారు. అలాగే మురికి కాల్వల నుంచి మురికి నీరు బయటకు వచ్చే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. బహిరంగంగా డ్రైనేజీ కవర్లు ధ్వంసం చేస్తున్నప్పటికీ సంబంధిత అపార్ట్ మెంట్ ఓనర్లపై జీహెచ్ఎమ్ సీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. భవనాల నిర్మాణ పనులకు సంబందించిన చెత్త, చెదారం, నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు అపార్ట్ మెంట్ ల వద్ద నుంచి క్లియర్ చేయకపోవడంతో వాటినుంచి వచ్చే దుమ్ము, దుర్వాసన తదితర వాటితో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన సంబందిత జీహెచ్ఎమ్సీ శానిటేషన్, టౌన్ ప్లానింగ్ అధికారులు భవనాలు, అపార్ట్ మెంట్ నిర్మాణ పనులు జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం, చెత్త నిల్వలు తదితర అంశాలపై దృష్టి సారించి, తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీలో అలరించిన స్వాగతోత్సవ్ 2కె24 వేడుకలు

జగిత్యాల జూలై 15 (ప్రజామంటలు):
పట్టణం లోని జ్యోతి హైస్కూల్ ఐఐటి అకాడమీలో " స్వాగతోత్సవ్ 2కె24" పేరిట నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా పాఠశాలలో చేరిన విద్యార్థులకు బహుమతులు అందించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నవి. మొబైల్ ఫోన్ వాడకంపై చేసిన నాటిక చూపరులను ఆలోచింపజేసింది. మొబైల్ వల్ల కలిగే అనర్థాలను నాటిక రూపంలో చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ బీయ్యాల హరిచరణ్ రావు, శ్రీధర్ రావు, మౌనికారావు, అజిత, రజిత, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అమ్మ మాట అంగన్వాడి బాట



ఇబ్రహీంపట్నం జూలై 15 (ప్రజామంటలు):
ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలోని అమ్మ మాట బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో తిరుగుతూ అంగన్వాడి పాఠశాలలో పిల్లల్ని చేర్పించాలని నినాదాలు చేస్తూ తల్లిదండ్రులకు పిల్లలను అంగన్వాడి పాఠశాలలో చేర్పించాలని వారు సూచించారు, ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తనుగుల రమేష్ ఉపాధ్యాయులు, మండలోజు అశోక్, అల్లకట్టు సత్యనారాయణ, చిలుముల రాజేష్, శ్రీపాదపు శ్రీలత, బొల్లు శంకర్, రాంపల్లి శివకుమార్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు సుందరగిరి గంగామణి, వై. సంజీవరాణి, ఆయాలు గుండు శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ వేయిటింగ్ హాల్ లో గుర్తు తెలియని డెడ్బాడీ



సికింద్రాబాద్ జూలై 15 (ప్రజామంటలు):
గాంధీ ఆసుపత్రి ఆవరణలో మరో గుర్తు తెలియని డెడ్ బాడీ వెలుగు చూసింది. చిలకలగూడ ఎస్.ఐ పి.కిషోర్ కథనం ప్రకారం గాంధీ ఆసుపత్రి ఎమర్జెన్సీ బ్లాక్ ఎదురుగా ఉన్న ఎన్టీపీసీ వేయిటింగ్ హాల్ లో కింద పడి ఉన్న 60%-%65 ఏండ్ల వయస్సు కలిగిన వృద్ధురాలి డెడ్ బాడీని చూసిన సెక్యూరిటీ సూపర్ వైజర్ సుబ్బారావు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే డెడ్ బాడీ వద్ద ఎలాంటి వివరాలు లభించకపోవడంతో పోలీసులు డెడ్ బాడీని గాంధీ మార్చురీకి తరలించి భద్రపరిచారు. ఫొటోలోని మహిళా డెడ్ బాడీని గుర్తుపట్టిన వారు చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో తెలపాలని ఎస్.ఐ. కోరారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాలను విజిట్ చేసిన కార్పొరేటర్



సికింద్రాబాద్ జూలై 15 ( ప్రజామంటలు):
ఆదివారం కురిసిన భారీ వర్షానికి ఎఫెక్ట్ అయిన ప్రాంతాలను సోమవారం బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ జీహెచ్ఎమ్సీ ఇంజనీరింగ్ అధికారులతో కలసి పర్యటించారు. డివిజన్ లోని ఎన్.ఎన్ నగర్ లో భారీ వర్షానికి కుప్పకూలిన ప్రహారీగోడ ప్రాంతాన్ని ఆమె సందర్శించి, పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గోడ కూలిన ఘటనలో ఎవరికి గాయాలు కలగలేదని స్థానికులు తెలిపారు. వాతావరణ శాఖ అధికారుల భారీ వర్షాల హెచ్చరికల నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ కంది శైలజ డివిజన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాలాల్లో చెత్త, చెదారం వేయవద్దని ప్రజలను కోరారు. నాలాల్లో చెత్త వేస్తే, దానివలన వర్షపు నీరు నాలాలో ప్రవహించకుండా ఒకే దగ్గర ఆగుతుందని, దాని వలన లోతుట్టు ప్రాంతాలు నీటిలో మునిగిపోతాయని అన్నారు.



తెలంగాణ రాష్ట్ర సిడి కార్పొరేషన్ చైర్మన్ సుంకటి అన్వేష్ రెడ్డి భాద్యతలు చేపట్టిన సందర్భంగా శాలువాతో సత్కారించిన జనగామ జిల్లా కిసాన్ సెల్ మాజీ అధ్యక్షులు, జనగామ మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొన్నే మహేందర్ రెడ్డి

## తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ కన్వీనర్ గా ఎల్మల రాంబాబు



మెట్టుపల్లి జూలై 15 (ప్రజామంటలు):
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ కన్వీనర్ గా మెట్ పల్లి పట్టణానికి చెందిన న్యాయవాది ఎల్మల రాంబాబు నియామకం అయ్యారు. దీనికి సంబంధించి రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ బాబు హైదరాబాద్ గాంధీభవన్ లో సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖార్గే, సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఇట్టి నియామకం చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎల్మల రాంబాబు మాట్లాడుతూ, న్యాయపరమైన అంశాల పట్ల కాంగ్రెస్ పార్టీకి నిరంతర సేవలు అందిస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతక్క, మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరం, కొమిరెడ్డి విజయ్ ఆజాద్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మెట్ పల్లి లో పలువురు న్యాయవాదులు రాంబాబు ను కలసి శుభాకాంక్షలు తెలిపారు.

# అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలి

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ జులై 15 (ప్రజామంటలు):
ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సోమవారం జగిత్యాల జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలసి వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ఫాజల్ నగర్ రిజర్వాయర్ ,మర్రిపల్లి రిజర్వాయర్, చందుర్తి రిజర్వాయర్ తో పాటు మోత్కరావుపేట చందుర్తి రోడ్డును, జోగాపూర్ పంప్ హౌస్, కలికోట సూరమ్మ చెరువును సందర్శించారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లతో కలిసి సందర్శించడం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అతి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నిరందించే ప్రాజెక్టుల నిర్మాణం త్వరగా చేపట్టాలని తీసుకున్నప్పుడు శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టును మొదటి ప్రాధాన్యత క్రమంలో చేర్చాడం జరిగింది. ఆనాడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 1731 కోట్ల నిధులు మంజూరు చేసి కలికోట సూరమ్మ చెరువు ప్రాజెక్టు వరకు శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ 2 ఫేజ్ 1,.. స్టేజ్ 2 ఫేజ్ 2 లో పూర్తి చేయాలని సంకల్పించారు. కలికోట సూరమ్మ చెరువు నుండి కుడి ఎడమ కాలువల ద్వారా 43 వేల ఎకరాలకు సాగునీరు అందించే పనుల పురోగతిని పరిశీలించడం జరిగింది. వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ రిజర్వాయర్, మర్రిపల్లి లోని అసంపూర్తిగా ఉన్న రిజర్వాయర్ ను పరిశీలించడం జరిగింది. చందుర్తి రిజర్వాయర్ తో పాటు చందుర్తి మేడిపల్లి భీమారం మండల ప్రజలకు ఎంతో ఉపయోగపడే చందుర్తి మోత్కరావుపేట రోడ్డును సందర్శించడం జరిగిందని తెలిపారు. వీలైనంత త్వరగా అటవి శాఖ అనుమతులు తీసుకువచ్చి రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేస్తాం. కలికోట సూరమ్మ చెరువు లో నష్టపోతున్న పైపు లైన్ చెరువులకు బావులకు నష్టపరిహారం చెల్లించి అలాగే కుడి ఎడమ కాలువలకు భూసేకరణ జరిపి వీలైనంత త్వరగా పనిని ప్రారంభిస్తామన్నారు. గతంలో ఈ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి కావాలని ప్రజల పక్షాన అనేక ఆందోళన చేసిన వారిగా ప్రజలు మాకు అవకాశం ఇవ్వడంతో ఆ బాధ్యత మాపై ఉందన్నారు. ఆనాడు ఈ ప్రాజెక్టు కొరకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జీవన్ రెడ్డి, అడ్లురి లక్ష్మణ్ వచ్చి ఈ ప్రాజెక్టు యొక్క ఆవశ్యకతను తెలుసుకున్నారు. ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో మన ప్రాంత ప్రజల పక్షాన రైతుల పక్షాన జిల్లా కలెక్టర్లు వారికి నివేదిక అంద చేస్తారు. నిన్నటి రోజున మన ప్రాంతంలోని సబ్ స్టేషన్ ల మంజూరు, కొన్ని సబ్ స్టేషన్ లో అప్ గ్రేడ్ కోసం ఉప ముఖ్యమంత్రిని కలవడం జరిగిందన్నారు. ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతూ అన్ని వర్గాల ప్రజలకు ప్రజా పాలన అందజేస్తామన్నారు.

# ఎస్‌బిఐ వడ్డీరేట్లు పెంపు

## వెంటనే అమల్లోకి వచ్చిన నిర్ణయం

న్యూఢిల్లీ,జూలై15 (ప్రజా మంటలు):
దేశీయ అతిపెద్ద బ్యాంక్ 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' నిధుల వ్యయం ఆధారిత రుణ వడ్డీ రేట్లను పెంచుతున్నట్లు సోమవారం వెల్లడించింది. కొన్ని కాలపరిమితులపై ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్ల (0.10 శాతం) వరకు పెంచింది. సవరించిన రేట్లు సోమవారం నుంచే అమలవుతాయని ఎస్‌బీఐ తన అధికారిక వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఏడాది కాలవ్యవధి గల ఎంసీఎల్ఆర్‌ను 8.75 శాతం నుంచి 8.85 శాతానికి, ఆరు నెలల కాలవ్యవధికి 8.65 శాతం నుంచి 8.75 శాతానికి, రెండేళ్లకు 8.85 శాతం నుంచి 8.95 శాతానికి, మూడేళ్ల కాలపరిమితి 8.95 శాతం నుంచి 9 శాతానికి ఎస్‌బీఐ పెంచింది. దీంతో ఎంసీఎల్ఆర్ ఆధారిత లోన్ల ఈఎంఐలు మరింత భారం కానున్నాయి. ఎస్‌బీఐ ఆటో రుణాలు ఒక సంవత్సరం, వ్యక్తిగత రుణాలు 2 సంవత్సరాల ఎంసీఎల్ఆర్‌కు అనుసంధా నించి ఉన్నాయి. ఎంసీఎల్ఆర్ అనేది ప్రామాణిక రుణ రేటు. నిధుల సేకరణకు బ్యాంకులకు అయ్యే వ్యయం, నిర్వహణ వ్యయం, క్యాష్ రిజర్వు రేషియో (సీఆర్ఆర్), కాలపరిమితి, ప్రీమియంలను పరిగణలోకి తీసుకుని ఎంసీఎల్ఆర్‌ను లెక్కిస్తారు. బ్యాంకులు ఎంసీఎల్ఆర్ కంటే తక్కువకు రుణం అందించే అవకాశం ఉండదు. వివిధ కాలపరిమితులకు (ఓవర్ నైట్ నుంచి మూడేళ్ల వరకు) ఎంసీఎల్ఆర్ వేర్వేరుగా ఉంటుంది. ఎస్‌బీఐ ప్రస్తుతం గృహ రుణాలను 'ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్స్' ఆధారంగా ఇస్తోంది. దీంట్లో మాత్రం ఎలాంటి సవరణలు చేయలేదు. ప్రస్తుతం ఈ ఈబీఎల్ఆర్ 9.15శాతం ? సీఆర్‌పీ ? బీఎస్‌పీ వద్ద స్థిరంగా ఉంచింది. ప్రస్తుతం ఎస్‌బీఐ హోంలోన్ వడ్డీరేటు 8.50 శాతం నుంచి 9.65 శాతం మధ్య కొనసాగుతోంది. సిబిల్ స్కోర్ సహా ఇతర అర్హతలను బట్టి ఇది మారుతుంది.

# ఉద్యోగాల భర్తీకి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

## ఉద్యోగాల భర్తీ క్యాలెండర్ అమలు చేస్తాం - ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



జగిత్యాల జులై 15 (ప్రజామంటలు):
జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ప్రైవేట్ సెక్టార్ లో సైతం నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందిస్తామని విలేకరుల సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం ఉద్యోగాల భర్తీ లో వివక్ష చూపుతున్నారని, ఉద్యోగ నియామకాల కోసం ఉద్యమం సాగింది. నిరుద్యోగులు, విద్యార్థులు, ఆత్మ బలిదానాలు, అమరుల త్యాగాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. బీఆర్ఎస్ ను ఉద్యమ పార్టీ గా భావించి దశాబ్ద కాలం ప్రజలు బీ రెండు సార్లు అవకాశం కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలో 1.91,000 పోస్టులు ఉన్నాయని బిస్వల్ కమిటీ సూచించిన ఉద్యోగాల భర్తీ పై నిర్లక్ష్యం వహించింది. టెట్ నిర్వహణ ను కూడా నిర్లక్ష్యము చేశారు. టెట్ ప్రతి సంవత్సరం రెండు సార్లు నిర్వహించాలి. గత ప్రభుత్వం నాలుగేళ్లకు ఒకసారి నిర్వహించింది. గ్రూప్ 1 పేపర్ లీ కేజీ తో రాష్ట్రం పరువు పోయింది.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తోనే 30 వేల మంది నియామకాలు చేపట్టినం. గతంలో నోటిఫికేషన్ 5,000 పోస్టులు ఇస్తే 11,000 లకు పెంచినం. గ్రూప్ 1 పరీక్ష ప్రిలిమ్స్ కూడా పూర్తి చేసినం.

గ్రూప్ 2 పరీక్షలు సైతం నిర్వహించేందుకు అన్ని సిద్ధం చేసినం. ప్రైవేట్ సెక్టార్ లో సైతం నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ కల్పిస్తాం. ఐటిఐలను అడ్వాన్స్ టెక్నాలజీ కలాశాలలుగా అప్గ్రేడ్ చేసినం. సీఎం రేవంత్ రెడ్డీ పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించుకొని పరీక్షలు నిర్వహిస్తుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక ఏ విధంగా ఆటంకాలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నోటిఫికేషన్ కు అనుగుణంగా పరీక్షలు నిర్వహించాలి. మార్పులు చే స్తే న్యాయ స్థానం జోక్యం చేసుకుంటుంది.

గ్రూప్ -1 మెయిన్స్ కు 1:100 పరీక్షలు ఇవ్వాలనడం దేనికి సంకేతం. బీఆర్ ఎస్ బుద్ధి మారడం లేదన్నారు. ప్రతిపక్షాలు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఆటంక పరిచే ధోరణి విడనాడి, ప్రభుత్వానికి సూచనలు ఇవ్వాలని హితవు పలికారు. డీఎస్సీ పరీక్ష జూలై 18 నుండి ప్రారంభం అవుతుందన్నారు. ఇప్పటికే డీఎస్సీ పరీక్ష కోసం హాల్ టికెట్ సైతం డౌన్లోడ్ చేసుకొని పరీక్ష రాసేందుకు సిద్దంగా ఉన్నారు. ఇప్పుడు డీఎస్సీ పరీక్ష రద్దు చేయాలనడం హాస్యాస్పదమన్నారు. నిరుద్యోగ యువతలో ఆత్మస్థైర్యం నింపాల్సింది పోయి, ప్రతిపక్షాలు నిరుద్యోగులను గందరగోళానికి గురి చేస్తున్నాయి. ప్రతిపక్షాలు వీలైతే నియామకాల ఖాళీల భర్తీ చేపట్టే అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకు రావాలని హితవు పలికారు. ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీలకు అనుగుణంగా ప్రతి సంవత్సరం భర్తీ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఉద్యోగాల భర్తీ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుంది అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.



# అమ్మ మాట అంగన్ వాడి బాట అవగాహన ర్యాలీ

జనగామ జూలై 15 (ప్రజామంటలు): జనగామ గాను గపహాడ్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం శిశు సంక్షేమ శాఖ వారి పిలుపులో భాగంగా అమ్మ మాట అంగన్ వాడి బాట అని నినాదంతో పాఠశాల విద్యార్థులతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ నజీమ్ ఉన్నిసా పాల్గొని మాట్లాడుతూ చిన్నారులను అంగన్వాడి పాఠశాలలో చేర్పించాలని చదివే వాళ్లకు బంగారు భవిష్యత్తు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు దడిగే పద్మ, శ్రీదేవి, గుగులోతు అరుణ, ఏఎన్ఎం నవనీత, ఆశా వర్కర్లు ఇందిరా సునీత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎక్స్ కవేటర్ యాజమాని బైండోవర్

ఎల్కతుర్తి జూలై 15 (ప్రజామంటలు): చెరువులు, వాగుల్లో అక్రమంగా మట్టిని తీస్తున్న ఎక్సవేటర్యాజయానిని సోమవారం తహసీల్దార్ జగత్ సింగ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై గోదారి రాజ్ కుమార్ తెలిపారు. ఎల్కతుర్తి మండలం జగన్నాథ్ పూర్ గ్రామానికి చెందిన కస్తూరి పరమేష్ తన ఎక్స్కావేటర్ తో మండలం లోని పలుగ్రామాల్లో గల చెరువులు, కుంటలు, వాగుల్లో నిత్యం వందలాది ట్రిప్పుల మట్టిని తీసి విక్రయిస్తుండగా పలు సారు పట్టు బడ్డారు. అయినప్పటికి తీరు మార్చుకోక పోవడంతో ఎక్స్కావేటర్ తో పాటు యాజమాని పరమేష్ ను తహసీల్దార్ ఎదుట సంవత్సరం పూచికత్తుపై బైండోవర్ చేసినట్లు తెలిపారు. చెరువులు, వాగుల్లో అక్రమంగా మట్టిని తీస్తున్న ఎక్సవేటర్ యాజయానిని సోమవారం తహసీల్దార్ జగత్ సింగ్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై గోదారి రాజ్ కుమార్ తెలిపారు. ఎల్కతుర్తి మండలం జగన్నాథ్ పూర్ గ్రామానికి చెందిన కస్తూరి పరమేష్ తన ఎక్స్కావేటర్ తో మండలంలోని పలు గ్రామాల్లో గల చెరువులు, కుంటలు, వాగుల్లో నిత్యం వందలాది ట్రిప్పుల మట్టిని తీసి విక్రయిస్తుండగా పలు సారు పట్టుబడ్డారు. అయినప్పటికి తీరు మార్చుకోక పోవడంతో ఎక్స్కావేటర్ తో పాటు యాజమాని పరమేష్ ను తహసీల్దార్ ఎదుట సంవత్సరం పూచికత్తుపై బైండోవర్ చేసినట్లు తెలిపారు.

# ఎల్కతుర్తి ఆటో యూనియన్ అధ్యక్షులుగా లోకిని తిరుపతి





ఎల్కతుర్తి జూలై 15 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండలంలోని ఆటో యజమాన్యం ఎలక్షన్లు నిర్వహించగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఆటో యజమాన్యం డ్రైవర్ల అసోసియేషన్ ఏకగ్రీవంగా అధ్యక్షులు ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శి కోశాధికారిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది అధ్యక్షులుగా లోకిని తిరుపతి, ఉపాధ్యక్షులు అంచనగిరి రవి, రెండవసారి కూడా ఏకగ్రీవంగా ఎన్నికైనందుకు అధ్యక్షులను యూనియన్ మొత్తం అభినందించారు.

## దండేపల్లిలో బడి బాట నిర్వహించిన

# అంగన్వాడీ సిబ్బంది

ఎల్కతుర్తి, జూలై 15 (ప్రజామంటలు):
మండలంలోని దండేపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఉపాద్యాయులు బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పించాలని తల్లి దండ్రులను కోరారు. దీని కోసం గ్రామంలోని మాజీ ప్రజా ప్రతినిధులు, ఏఎల్ఎంఎస్సీ సభ్యులు, వీడీఏలు, ఆశాలు, స్కూల్ టీచర్లు, పాఠశాల మేనేజ్మెంట్ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ హై స్కూల్ హెచ్ఎం రమేష్, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుజాత, ఏఎన్ఎం అనురాధ, అంగన్వాడీ టీచర్లు అన్నపూర్ణ, తిరుపతమ్మ, ఉపాంజలి, ఆశాలు, వీవోలు తదితరులు పాల్గొన్నారు.



## వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి సతీమణి కాంతా కుమారి

గొల్లపల్లి జులై 15 (ప్రజామంటలు):
గొల్లపల్లి మండలం రాపల్లి లో ప్రభుత్వ విప్పు ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి కాంత కుమారి వన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటి అలాగే బడిబాట కార్యక్రమం భాగంగా స్కూల్ పిల్లలతో కలిసి ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో రాపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర భూమయ్య, ఉపాధ్యక్షులు జలంధర్, సీనియర్ నాయకులు నక్క గంగరాజు , కోడిపెల్లి రాజయ్య, దుబ్బయ్య, మల్లేశం, నాయకులు కార్యకర్తలు యువకులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో కీలకం



జనగామ జూలై 15 (ప్రజామంటలు):
వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా లక్ష్యాల వారీగా ఆయా శాఖ లు మొక్కలను నాటాలని జనగామ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థ లు) పింకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలోని సమీకృత అదనపు కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ సంబంధిత జిల్లా అధికారులతో వనమహోత్సవ కార్యక్రమంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మాట్లాడుతూ.... మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి గానూ జిల్లాలో మొత్తం 2,627,800 మొక్కలను నాటే నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. దీనికి సంబంధించిన యాక్షన్ ప్లాన్ ను రూపొందించుకోవాలని, పర్యావరణ పరిరక్షణకై వనమహోత్సవ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పచ్చదనాన్ని పెంపొందించడంలో జిల్లాను అగ్రగామిగా నెలకొల్పాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఆయా శాఖల సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను తప్పుదోవ పట్టించేలా ప్రకటలు

## బిఆర్ఎస్ తీరుపై మండిపడ్డ షబ్బీర్ అలీ

కామారెడ్డి,జూలై15 (ప్రజా మంటలు):
ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని మాజీమంత్రి, ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. గతంలో ప్రభుత్వ పథకాల పేరుతో 9ఏళ్లల్లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు భారీగా సంపాదించారని షబ్బీర్ ఆరోపించారు. ఉద్యోగాల భర్తీ, కరెంట్, జీతాలు తదితర విషయాల్లో ప్రజలను తప్పుదోవ పట్టించేలా బిఆర్ఎస్ చేస్తోందని అన్నారు,. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. మిషన్ భగీరథ పెద్ద ఫ్రాడ్ అని తేలిందని అన్నారు. ధరణి ఒక దుర్మార్గమైన సాఫ్ట్‌వేర్ అని కూడా తేలిపోయిందని మండిపడ్డారు. ఏ గ్రామంలో మిషన్ భగీరథ నీళ్ళు రావడం లేదన్నారు. పైపులు, ట్యాంకులు ఉన్నాయి గానీ నీళ్ళు రావడం లేదన్నారు. ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్ అని స్పష్టం చేశారు. కరెంట్ కోసం బీఆర్ఎస్ చేసింది ఏంటి అని ప్రశ్నించారు. అప్పుడు చేసి మింగారని అన్నారు. భద్రాద్రి, యాదాద్రి ప్లాంట్ల పేరుతో నిధులు దిర్వినియోగం చేశారని అన్నారు. అయినా బీఆర్ఎస్ నేతలకు అవగాహన రావడం లేదని విమర్శించారు. ఉచిత విద్యుత్‌పై బీఆర్ఎస్ చేసింది ఏంటి అని ఆయన ప్రశ్నించారు. 1999 మేనిఫెస్టో లోనే ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పామన్నారు. 'మేము చేసిన పనిని కంటిన్యూ చేస్తూ మేం చేస్తున్నాం అని చెప్తే ఎలా?' అంటూ నిలదీశారు. బీఆర్ఎస్, కేసీఆర్, కేటీఆర్, హరీష్ పని అయిపోయిందన్నారు. ఎత్తిపోయిన బీఆర్ఎస్ గురించి ఏం మాట్లాడుతాం అంటూ వ్యాఖ్యలు చేశారు. లక్షల కోట్ల రూపాయలు దండుకోవడం తప్పా కేసీఆర్ ఏం చేయలేదన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని కుటుంబం ఉండకూడదు అనేది కాంగ్రెస్ పాలసీ అని అన్నారు. అందుకే ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం చుట్టామని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అందరికీ ఇల్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సింగరేణి సంస్థ రాష్ట్ర అస్థి. గనులన్ని సింగరేణికి ఉండేలా చూస్తామన్నారు. ప్రభుత్వ అండతో ప్రైవేట్ సంస్థలు శ్రమ దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. ధరణి వల్ల లక్షల మంది తమ భూములపై హక్కులు కోల్పోయారన్నారు. ధరణి వల్ల ప్రజలకు చాలా నష్టం కలిగిందని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ద్వారా ప్రజల సంపద ప్రజలకు పంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రజల అవసరాలే తమ అజెండా అన్నారు. గతంలో సంపద, వనరులు, స్వేచ్ఛ పాలకులకే పరిమితమయ్యాయని అన్నారు. తాము ఏం చేశామో ప్రజలకు తెలుసన్నారు. తొమ్మిది ఏండ్లలో ఏదో అద్భుతం జరిగినట్టు కేసీఆర్ భ్రమ కల్పిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ వనరులను ప్రభుత్వ పెద్దలు దోచేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ యువత కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు. ధరణితో తమ భూములు తమకు కాకుండా చేసారని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ పూర్తిగా ఫెయిల్ అయిందన్నారు. కేసీఆర్ పాలనలో ఒక్క వర్గం కూడా



సంతోషంగా లేరని చెప్పుకొచ్చారు. తెలంగాణలో స్వేచ్ఛనే లేకుండ పోయిందన్నారు. భయం భయంగా బతకాల్సిన పరిస్థితి తెలంగాణలో ఉండేదన్నారు. పోలీస్ వ్యవస్థ అధికార పార్టీ ఎమ్మెల్యేల చేతిలోకి పోయిందన్నారు. ఇవన్నీ పోయి ప్రజలు ఇప్పుడు స్వేచ్ఛగా బతుకుతున్నారని, ఇచ్చిన హామీల అమలుకు సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు.

# మొక్కలను నాటి.. పచ్చదనం పెంచాలి

## ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

కామారెడ్డి,జూలై15 (ప్రజా మంటలు):
వాతావరణంలో అసమానతలు తొలగించేందుకు పర్యావరణాన్ని రక్షించడంలో మొక్కలు పెంపకం తప్పనిసరి అని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి తెలిపారు. వన సంరక్షణలో ప్రతి ఒక్కరూ మమేకం కావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. ఇది లాభాపేక్ష లేని కార్యక్రమంగా చూడాలన్నారు. పోడు పట్టాలు పొందిన రైతులు తప్పకుండా మొక్కలు పెంచాలన్నారు. ఇలా అయినా కొంత పచ్చదనం దోహదపడగలదన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఏదైనా గ్రామాన్ని దత్తతగా భావించి పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని అన్నారు. వ్యాపార దృక్పథంతో చూడకుండా సమాజానికి ఏదైనా పది కాలాల పాటు మేలు కలిగేలా ఉండే ఇలాంటి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇలాంటి కార్యక్రమంలో పాల్గొని భావితరాలకు పచ్చదనం, ఆరోగ్యకర సమాజాన్ని అందించాలని అన్నారు. నేషనల్ హైవే వెంబడి మొక్కలు పెద్ద ఎత్తున నాటడం జరుగుతుందని తెలిపారు. ఇకపోతే ప్రతీ గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతున్నామని అధికారులు అన్నారు.ప్రతీ గ్రామంలో ఈజీఎస్ అధికారులతో నర్సరీలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతీ గ్రామంలో స్థలాలను ఎంపిక చేస్తున్నామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, వన సంరక్షకుల ఆధ్వర్యంలో మొక్కలను పెంచుతామన్నారు. ముందుగానే ప్రణాళికలు తయారు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం ప్రకారం పచ్చదనాన్ని 33 శాతానికి చేరాలంటే జిల్లాలో ప్రతి ఒక్కరూ 20 మొక్కలు నాటాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగా చాలా చోట్ల అడవి తగ్గిపోయింది. పచ్చదనం కాస్తా కనుమరుగై మైదానాలను తలపిస్తోంది. జిల్లా అంటే ఒకప్పుడు సువిశాల అటవీ ప్రాంతం ఇప్పుడు కాస్తా అడవి హరించుకుపోవడంతో వర్షాలు లేక ఏటా అక్కడక్క డ అల్ప వర్షాపాతం సైతం నమోదు అవుతోంది. అటవీ సంపదను పునరుద్ధరించి ఇలాంటి పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వం పథకాన్ని అమలు చేస్తోంది. పల్లెల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చూస్తోంది. గ్రామాలు, పట్టణాల్లో చైతన్యవంతులైన ప్రజలు మొక్కలు నాటే కార్యాక్రమంలో పాల్గొంటే సంకల్పం నెరవేరినట్లేనని అధికారులు భావిస్తున్నారు. టేకు మొక్కలతో పాటు వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలు, యూకలిప్టస్, కానుగ, వేప, జామాయిల్ తదితర రకాల మొక్కలు కొద్ది రోజుల్లోనే నాటేందుకు సిద్ధం కానున్నాయి.



# ఉప్పొంగుతున్న హుస్సేన్‌సాగర్

విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. నైరుతి రుతుపవనాలు బలపడటానికి తోడు.. అల్ప పీడన ప్రభావంతో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ వర్షాలు ఈ రోజు నుంచి ఐదు రోజుల పాటు అంటే జులై 18 వరకు ఈ వర్షాలు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని కొన్ని జిల్లాలకు వర్ష సూచన చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో నైరుతి రుతుపవనాలకు తోడు ఆవర్తనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం చెప్పింది. ఏపీకి భారీ వర్షసూచన చేసింది వాతావరణశాఖ. రాష్ట్రంలో అల్లూరి సీతరామరాజు, ఎన్టీఆర్, కృష్ణ, ఏలూరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ను అమరావతి వాతావరణ శాఖ జారీ చేసింది. ఇక ఏపీలో మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నేడు, రేపు కోస్తా జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉండగా.. అలాగే, రాయలసీమలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంటకు 30-40 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. భారీ వర్షాల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది. రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

**తెలంగాణాకు భారీ వర్ష సూచన**

తెలంగాణాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా పశ్చిమ, నైరుతి దిశల నుండి ఎక్కువ స్థాయిలో గాలులు వీచే అవకాశం ఉంది. ఈ నేపధ్యంలో రాష్ట్రంలో కొత్తగూడెం, ఖమ్మం, సూర్యపేట, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా.. మిగిలిన జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. బలమైన నైరుతి రుతుపవనాలకు తోడు.. సముద్ర మట్టానికి 3.1కి.మీ. నుంచి 7.6 కి.మీ. మధ్యలో ఆవర్తనం కొనసాగుతుందని వాతావరణశాఖ చెప్పింది. రాష్ట్రంలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది.

- తోసిపుచ్చిన ప్రత్యేక న్యాయమూర్తి
- ఆభరణాల తరలింపునకు మరో రోజు నిర్ణయం

### భాండాగారానికి పాముల కాపలా

# ప్రచారం అబద్ధం



పూరీ (ప్రజా మంటలు):
ఒడిశాలోని విశ్వప్రసిద్ధ శ్రీక్షేత్రంలో పూరీ జగన్నాథుని రత్నభాండాగారాన్ని అధికారులు ఆదివారం తెరిచారు. యావత్ దేశం ఉత్కంఠగా ఎదురు చూస్తోన్న వేళ 46 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆలయంలోని రహస్య గది తలుపులు మెజిస్ట్రేట్ సమక్షంలో తెరిచారు. ఈ సందర్భంగా స్వామివారికి చెందిన విలువైన వస్తువుల్ని లెక్కించేందుకు 11మందితో ఏర్పాటు చేసిన బృందానికి సారథ్యం వహిస్తున్న ఒడిశా హైకోర్టు విశ్రాంత జడ్జి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ మాట్లాడారు. మేజిస్ట్రేట్ సమక్షంలో గది తాళాలు పగలగొట్టిన తర్వాత తమ బృందం గదిలోకి ప్రవేశించిందని తెలిపారు. ఆ 'రహస్య గది' లోపల భాండాగారానికి పాములు కాపలాగా ఉన్నాయంటూ పెద్ద ఎత్తున జరిగిన ప్రచారాన్ని ఆయన తోసిపుచ్చారు. తమ బృందంలో ఏడెనిమిది మంది ఆలయ మేనేజ్‌మెంట్ సభ్యులు ఉన్నారని.. వీరంతా బహుడా యాత్ర సన్నహాల్లో బిజీగా ఉన్నందున తనిఖీలకు, ఆభరణాల తరలింపునకు తగిన సమయం లభించలేదని చెప్పారు. అందువల్ల దేవతామూర్తుల ఆభరణాలు, విలువైన రత్నాలను తరలింపునకు మరో తేదీని నిర్ణయిస్తామని తెలిపారు. శ్రీ జగన్నాథ్ ఆలయం పాలనాధికారి అరవింద పాఢి మాట్లాడుతూ.. అవుటర్ ట్రెజరీలో భద్రపరిచిన ఆభరణాలను ఆలయం ప్రాంగణం లోపల తాత్కాలికంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించినట్లు చెప్పారు. ఆ తర్వాత దీనికి మెజిస్ట్రేట్ సమక్షంలో సీలు వేసినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. పెంచిన తల్లి సన్నిధిలో జగన్నాథుని లీలలు ఆదివారంతో ముగియడంతో సోమవారం బలభద్ర, సుభద్ర, సుదర్శనులతో కలిసి స్వామి శ్రీ క్షేత్రానికి బయల్దేరారు. నందిఘోష్, తాళధ్వజ, దర్పదళన్ రథాలపై చేరుకోనున్నారు. ఈ వేడుకనే బహుడా యాత్రగా పేర్కొంటారు. ఇప్పటికే ఈ యాత్ర కొనసాగుతోంది. దాదాపు 8లక్షల మంది భక్తులు పాల్గొంటారనే అంచనాలతో అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# డ్రగ్స్ విక్రయ ముఠా అరెస్ట్

**-పోలీసుల అదుపులో ఐదుగురు వ్యక్తులు .. అరెస్ట్..మరో ఇద్దరు పరారీ**

హైదరాబాద్, (ప్రజా మంటలు):
డ్రగ్స్ విక్రయ ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీగా డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేయగా.. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు డీసీపీ శ్రీనివాస్ మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో ఇద్దరు నైజీరియన్లు కూడా ఉన్నట్లు తెలిపారు. రూ.35 లక్షల విలువైన 199 గ్రాముల కొకైన్‌తోపాటు, రెండు పాస్‌పోర్టులు, 10 ఫోన్లు, 2 బైకులను సీజ్ చేశామన్నారు.నిందితులను ఒనొహా బ్లెస్సింగ్, అజీజ్ నోహీం, వెంక గౌతమ్, వరుణ్ కుమార్, మహ్మద్ షరీఫ్‌లుగా గుర్తించారు. పరారీలో ఉన్న ఇద్దరి గురించి సమాచారం ఇస్తే రూ.2 లక్షల రివార్డు ఇస్తామని డీసీపీ ప్రకటించారు. ' అనొహా ÷-లబెస్సింగ్ ఇక్కడికి డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తుంది. ఇప్పటి వరకు ఆమె 20సార్లు నైజీరియా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చినట్లు గుర్తించాం. ఆమె దగ్గర 13 మంది డ్రగ్స్ కొనుగోలు చేసినట్టు గుర్తించాం. వారిలో ఆరుగురికి కొకైన్ టెస్టులో పాజిటివ్ వచ్చింది. వీరిపైనా కేసులు నమోదు చేశాం. పాజిటివ్‌గా తేలిన వారిలో అమన్ ప్రీత్‌సింగ్, అంకిత్, ప్రసాద్, నిఖిల్ తదితరులు ఉన్నారు ' అని డీసీపీ వివరించారు.

# రేషన్ కార్డు, పీఎం కిసాన్ డేటా అంటూ కోర్రీలెందుకు?

- పథకానికి అనవసర ఆంక్షలు పెట్టడం సరికాదు
- ఇది కొందరినే రుణమాఫీకి పరిమితం చేసే యత్నం
- మార్గదర్శకాల విడుదలకు ఇంత సమయమా?
- రుణమాఫీపై సర్కారువి మభ్యపెట్టే ప్రయత్నాలు
- కాలయాపన చేయడంలో రైతులను మోసం చేసే కుట్ర
- మార్గదర్శకాలపై మండిపడ్డ నిరంజన్ రెడ్డి

హైదరాబాద్, (ప్రజా మంటలు):
రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం.. రైతాంగాన్ని వంచించడమేనని మాజీ వ్యవసాయశ్శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు .. అమలు చేసేటప్పుడు ఎందుకని ప్రశ్నించారు. ఈ ఆంక్షలు విధించడానికి ఈ ఏడు నెలల సమయం ఎందుకు తీసుకున్నట్లని అన్నారు. పంటల రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర వ్యవసాయ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలపై మాజీ మంత్రి ఫైర్ అయ్యారు. అవి మార్గదర్శకాలు కావు.. మభ్య పెట్టేందుకు ప్రయత్నాలు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంది అని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంతో మంది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి రాష్ట్రంలో పడిన రైతుల రుణభారాన్ని తొలగించడం కోసం వ్యవసాయ సుస్థిరత కోసం కేసీఆర్ 2 విడుతల రుణమాఫీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలకు కేసీఆర్ సర్కార్ శ్రీకారం చుట్టింది. మొదటి విడుతలో 35.31 లక్షల మంది రైతులకు రూ. 16,144.10 కోట్లు రుణమాఫీ చేశారు. రెండో విడుతలో 22 లక్షల 98 వేల 39 రైతులకు రూ. 13,000.51 కోట్లు రుణమాఫీ చేశారు. ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం అసలు రైతులకు రుణాలే మాఫీ చేయనట్లు కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేసింది. తాము అధికారంలోకి వస్తే ఇలా ఎన్నికలు అయిపోగానే అలా డిసెంబరు 9న రుణమాఫీ చేస్తాం అని కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో ఉన్న 69 లక్షలపై చిలుకు ఉన్న తెలంగాణ రైతాంగంలో ఆశలు రేపింది. అందరి రుణాలను మాఫీ చేస్తామని ఆ రోజు బహిరంగంగా చెప్పారు. ఈ రోజు కొందరికే పరిమితం చేసేందుకు



మార్గదర్శకాలు తీసుకువచ్చారు. ఈ రోజుల్లో 5 ఎకరాల వ్యవసాయదారుడు, రూ. 30 వేల జీతం చేసే ఉద్యోగి కూడా ట్యాక్స్ పరిధిలోకి వస్తున్నాడు. రేషన్ కార్డు, పీఎం డాటా వంటి తోకా తొండాలు పెట్టి కొందరినే రుణమాఫీకి పరిమితం చేస్తున్నారు. రుణమాఫీ చేశాం అన్న ప్రచారం చేసుకోవడానికి ప్రభుత్వ ప్రయత్నాలు తప్ప .. రైతాంగం బాగుండాలి .. వ్యవసాయం బాగుండాలి అన్న సంకల్పం ఈ ప్రభుత్వానికి లేదు అని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. అసలు రాష్ట్రంలో రూ.2 లక్షల రుణం పొందిన రైతులు ఎంత మంది ఉన్నారో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి. పీఎం కిసాన్ డాటాను మార్గదర్శకంగా తీసుకుంటాం అని ఎన్నికల ప్రచారంలో చెప్పలేదు. అసలు దానికి సంబంధించిన షరతులే లోపభూయిష్టం అయినవి. రుణమాఫీకి పీఎం కిసాన్ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడం.. రైతాంగాన్ని వంచించడమే .. హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు .. అమలు చేసేటప్పుడు ఎందుకు..? మరి ఈ ఆంక్షలు విధించడానికి ఈ ఏడు నెలల సమయం ఎందుకు తీసుకున్నట్లు ? నాడు పరుగెత్తి రుణాలు తీసుకోండి వెంటనే రుణమాఫీ చేస్తాం అని రైతులను పరుగులు పెట్టించి నేడు చావు కబురు చల్లగా చెబుతున్నారు. తెల్లరేషన్ కార్డు ప్రామాణికం కాదని సీఎం రేవంత్ ఇటీవలే ప్రకటించాడు.. సరిగ్గా నాలుగు రోజులు తిరగక ముందే నాలుక మడతేశాడు అని నిరంజన్ రెడ్డి కోపోద్రిక్తులయ్యారు.

EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TEL-TEL01938. FILE NO.1349985 PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com